www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 86 సోమవారం, ఆగస్టు 10, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad






# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

**విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు**

**ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు**

**జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా**

**అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్**

**అమరావతిఆగస్టు 9**
అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య

మిగతా 2లో.



## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా'


# కొత్త శక్తినిచ్చింది

**క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని**

**ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య**

**'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా**

**ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం**



**ఢిల్లీ ఆగస్టు 9:**
చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన**

**పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ**

**దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి**

**మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ**



**కోల్‌కతా ఆగస్టు 9:**
పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి

# కేసీఆర్ పరామర్శ..



**రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత**

**నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ**

**హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్**

**రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత**

**సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం**

**పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా**

**నర్సంపేట ఆగస్టు 9 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ. 2. 25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

## రాజమండ్రి ఘటనలో గాయపడిన

# ప్రియాంక మృతి

**సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం**

**మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు**

**ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్**



**హైదరాబాద్ ఆగస్టు 9:**
రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మిగతా 2లో.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు**

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ**




2లో.

# బస్సులారీ ఢీ..

## 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**

**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**



2లో.

# నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!**

**సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా**

**సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు**

**సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం**

**ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా**




2లో.

# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



**మొదటిపేజీ తరువాయి**

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

"సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

### మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు


రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

# బస్సులారీ ఢీ.. 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**

**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**



**పామిడి, ఆగస్టు 9:**

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు**

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**నిద్రమత్తే కారణమా?**

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..



**మొదటిపేజీ తరువాయి**

సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మొదటిపేజీ తరువాయి**

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

# నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్ ఆగస్టు 9:**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ా×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**అమరావతిఆగస్టు 9:**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

# గౌతమ బుద్ధ కబీర్దాస్ సంతు రవిదాస్ పూలే అంబేద్కర్ జగ్జీవన్ కా శ్రీరాముల నిజమైన వారసులం మనమే.

**- వంగూరి ఆనందరావు మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జి**





ఖమ్మం/వరంగల్ /ఆగస్ట్09/(పీపుల్స్ న్యూస్ ) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ మరియు మహాజన సోషలిస్ట్ పార్టీ ఎంఎస్పి రెడ్డిపాలెం కొత్తపేట గ్రామ కమిటీల నిర్మాణ సమావేశం వరంగల్ మండల ఇన్చార్జి గంగారపు మల్లన్న మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశాలలో వరంగల్ జిల్లా ఇన్చార్జి వంగూరి ఆనందరావు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడినారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధ మొదలుకొని మరియు సామ్రాట్ అశోక్ కబీర్దాస్ సంత రవిదాస్ పూలే అంబేద్కర్ ల నిజమైన వారసులం మనమేనని ఆయన ఈ సందర్భంగా తెలియజేసారు పీడత వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల మీద ప్రజలను పోరాటాలకు సమీకరిస్తూ మన మహానీయులు కలలుగన్న సమసమాజ నిర్మాణం వైపు సుదీర్ఘ పోరాటాలకు మనం సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ చారిత్రాత్మక నిర్మాణం కోసం నడుము కొట్టాల్సిన అవసరం ఆసన్నమైశీదని తెలియజేసారు ఈనాడు ముఖ్యంగా స్వాతంత్రం అనంతరం కనీసం హక్కులకు నోచుకుంటున్నామంటే మనలో ఏర్పడిందంటే మన ముందుతరం మహనీయులు నిరంతర శ్రమ ఆ మహనీయులు మనకోసం చేసిన త్యాగాలు అని మనం గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా ఆనంద్ రావు మాదిగ తెలియజేసారు ఆ మహనీయులు ఒక గొప్ప నూతన సమాజం కోసం కలలు కనడమే కాకుండా వారి కలలను నిజం చేసుకోవడం కోసం నాడు ముందుకు సాగుతున్న ప్రతి సందర్భంలో ఈ అసమానతలకు కారకులైన స్వార్థపర శక్తుల నుండి అనునిత్యం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ వారు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగారు గనుకనే నేడు మనం కనీస హక్కులను రాజ్యాంగపరంగా పొందగలుగుతున్నాం అని ఈ సందర్భంగా తెలియజేసారు సమాజ హితం కోరిన నేడు ఎమ్మార్పీఎస్ తీసుకునే నిర్ణయాల కనుగొనంగా నూతన నిర్మాణ కమిటీల బాధ్యులు ముందడుగు వేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా తెలియజేసా రు ఎమ్మార్పీ అంతిమ లక్ష్యమైన ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత ను సాధించిన అనంతరం నేడు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం ముందుకెళ్లే సందర్భంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీలు తీసుకునే నిర్ణయాలకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేసారు ఈ సమావేశాలలో వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్పిఎస్ జిల్లా నాయకులు కన్నూర్ చంద్రశేఖర్ మాదిగ వరంగల్ మండల మాజీ అధ్యక్షులు కన్నెబోయిన ప్రమోద్ మాదిగ ఎంఆర్పిఎస్ వరంగల్ జిల్లా మాజీ నాయకులు ఇసంపల్లి రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఒక్కల కుమార్ మాదిగ ఐయిత చరణ్ మాదిగ పెండ్యాల రవీందర్ మాదిగ గుండె ఏలియ మాదిగ మచ్చ ప్రదీప్ మాదిగ బత్తుల చందు మాదిగ గణిపాక శ్రీకాంత్ మాదిగ దాసరి ప్రేమ్ కుమార్ మాదిగ ఐత రంజిత్ మాదిగ గడ్డం నవీన్ మాదిగ జూపాక సురేంద్ర మాదిగ పులి నవీన్ మాదిగ కర్ణం సుధాకర్ మాదిగ గణిపాక చంటి మాదిగ మంద పవన్ మాదిగ తాటికాయల రాజు మాదిగ పాల్గొన్నారు.

# లింగమయ్య కాలనీలో మాజీ కౌన్సిలర్ సదువు మల్లేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ పోచమ్మ తల్లి బోనాలు





అమీన్‌పూర్ ఆగస్టు 09: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని సమీపంలోని లింగమయ్య కాలనీలో పోచమ్మ తల్లి ఆలయంలో మాజీ కౌన్సిలర్ సదువు మల్లేష్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్లు మరియు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు విచ్చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులను మాజీ కౌన్సిలర్ మల్లేష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి:ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సదువు మల్లేష్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పూర్వం తన తాతల కాలం నుంచే ఈ పోచమ్మ తల్లి ఆలయం ఇక్కడ వెలసిందని, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని గుర్తుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలనీవాసులందరం కలిసి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, కొల్లూరు యాదగిరి, దాసు యాదవ్, సత్యనారాయణ, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, ఇంజక్షన్ జ్ఞానేశ్వర్,స్థానిక భక్తులు, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# గుణ పాఠాన్ని బీజేపీ సమ్మతిస్తుందా... సమర్ధిస్తుందా...!

కాక్రోచ్ జనతా పార్టీ పేరిట దేశ రాజధాని ఢిల్లీలో వేలాని విద్యార్థులు, ఇతరేతర శక్తులు రగిల్చిన ఆందోళన... వారం రోజులు దాటినప్పటికీ దాని ప్రకంపనలు ఇంకా పోలేదు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పరిస్థితి పూర్తిగా సద్దుమణగడం లేదు. విద్యార్థులపై లాఠీచార్జి, పైల్లెట్లను ప్రయోగించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ పార్లమెంటును ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. చిన్నా చితక బిల్లులు తప్ప కీలక బిల్లులను ప్రవేశ పెట్టలేకపోతున్న ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేయాలని చూస్తుందేమో... విద్యార్థులపై లారీచార్జి దృశ్యాలు మాకెందుకు చూపిస్తున్నారు.. మా టైమ్ వేస్ట్ చేయకండి.. అని రెండు వారాల క్రితం వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థులపై ఎఫ్ఐఆర్లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి వీలు కల్పిస్తున్నారు. కేంద్రమే ఈ విషయంలో సుప్రీం కోర్టును ఆశ్రయించినందువల్ల తలెత్తుకుని తిరిగే దారి ప్రభుత్వానికి ఆయన కల్పిస్తున్నట్లున్నారు. ఒకవైపు తన అభిమానులు, బీజేపీ నేతలను విద్యార్థులు రకరకాల పదజాలంతో దూషిస్తున్నప్పటికీ... ప్రధానీ మోదీ ఎంతో పెద్ద హృదయంతో వారిని తాను క్షమించానని ప్రకటించారు. అయినా ఈ ప్రకటన అనుకున్నంత ఫలితాలు ఇవ్వలేదు. పార్లమెంటుకు మోదీ, అమిత్ షాలు వస్తున్నారే కానీ ఉభయ సభలకు హాజరయ్యే కావడం లేదు. ఆశ్చర్యకరమైనదేమంటే హోంమంత్రి అసలు నార్త్ బ్లాక్ హోం మంత్రిత్వశాఖకే రావడం లేదని, ఒకటి రెండు ముఖ్యమైన సమావేశాలు పార్లమెంటులో తన గదిలోనే నిర్వహిస్తున్నారని అధికారులే చెబుతున్నారు. ఈ సంక్షోభ సమయంలో మోదీని బాగా సంతోషపెట్టిన ఘటన ఒకటే. అవి ఆంధ్రప్రదేశ్లో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ఆయనను నృత్యగీతాలతో, ప్రశంసల కుంభవృష్టితో అలరించడం! మళ్లీ ఢిల్లీ తిరిగి రాగానే పరిస్థితిలో అదే వేడి! ఈ సంక్షుభిత సమయం ఎంతకాలం ఉంటుందో తెలియదు కానీ, ఇదే సమయంలో వచ్చిన మూడు అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలలో రాబోయే మార్పును సూచిస్తున్నాయని అనేక మంది పరిశీలకులు చెబుతున్నారు... ముఖ్యంగా బిహార్ లోని బంకీపూర్ నియోజక వర్గ ఎన్నికల ఫలితాలు. బిహార్ రాజధాని పాట్నా సాహిబ్ లోక్సభా పరిధిలో ఒక నియోజకవర్గమైన బంకీపూర్ కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు కేంద్రంగా మారింది. ఇటీవల నీటి ప్రశ్నపత్రాల లీక్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో విద్యార్థులు వీధుల్లోకి రాగా, పాట్నాలో దాని ఉధృతి తీవ్రంగా కనిపించింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ బంకీపూర్లో కేంద్రీకృతమైన కాలేజీల్లో, హాస్టళ్లలో ఉన్న వేలాది విద్యార్థులు ఊరేగింపుగా దూసుకువచ్చారు. సిటీలో విద్యార్థులు కోచింగ్ తీసుకునే కేంద్రాలు అధికంగా ఉన్న అశోక్ థ్, బోరింగ్ రోడ్లలో జనజీవనం స్తంభించిపోయింది. సివాన్, ఇతర కీలక జిల్లాల్లో నిరసన హింసాత్మకంగా మారింది. లాఠీచార్జీలు రాళ్ల రువ్వడం, బాష్పవాయువు, నీటి క్యాననల్లను ప్రయోగించడం, పోలీసు జీవులను దహనం చేయడం, జాతీయ రహదారులను బంద్ చేయడం వంటి సంఘటనలు జరిగాయి. ఏకే47తో కాల్పులు జరపడంతో విద్యార్థులు గాయపడ్డ వీడియోలు ప్రచారమయ్యాయి. బంకిపూర్ సందుగొందుల్లో ఉన్న ప్రైవేట్ హాస్టళ్లలోకి పోలీసులు దూసుకుపోయి కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థులను బయటకు లాగి చితకబాదారు. జూలై 25న ఇచ్చిన బిహార్ బంద్ సందర్భంగా ఒక్క రోజులో 690 మందిని నిర్బంధించారు. అనేకమందిపై హత్యా నేరం క్రింద కేసులు మోపారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే బంకీపూర్ ఉప ఎన్నిక జూలై 30న కాగా జూలై 27న బిహార్ హోం విభాగం విద్యార్థులపై అన్ని టఅతీలను ఉపసంహరించుకుంటూ అత్యవసర ఆదేశాలు చేసింది.కానీ ఫలితం లేకపోయింది. 1974 మార్చిలో జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో పాట్నా యూనివర్సిటీ విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించినప్పుడు పోలీసులు జరిపిన కాల్పులు, లారీచార్జిలో అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గాంధీ మైదాన్ లో లక్షలాది ప్రజల సమక్షంలో జరిగిన బహిరంగ సభలో జేపీ సంపూర్ణ క్రాంతికి పిలుపునిచ్చారు. బంకీపూర్లో అదే గాంధీ మైదానం పక్కనే ఉన్న చౌరస్తాలో నిర్మించిన జయప్రకాశ్ విగ్రహం ఇటీవలి సంఘటనలకు ప్రత్యక్ష సాక్షి జేపీ గోలంబర్గా పిలిచే ఈ ప్రాంతం పరిసరాల్లోనే మళ్లీ విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీకి ముందు జేపీ ఉద్యమం పాట్నా నుంచి ఢిల్లీకి పాకింది. ఇప్పుడు ఢిల్లీ నుంచి కాక్రోచ్ నిరసన పాట్నా వీధుల్లో ప్రతిధ్వనిం చింది. ఈ ప్రతిధ్వని బంకీపూర్ ఎన్నికల ఫలితాలను నిర్ణయించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ పట్టులో ఉన్న బంకీపూర్లో గెలిచింది. గత ఎన్నికల్లో అన్ని సీట్లూ కోల్పోయిన జన్ సురాజ్ పార్టీ నేత ప్రకాంత్ కిశోర్ కాదు, విద్యార్థులు అని వేరే చెప్పనక్కర్లేదు. ఇక్కడి నుంచి 5 సార్లు గెలిచినందువల్లే నితిన్ నబీన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అయ్యారు. ఆయన తన ఎమ్మెల్యే సీటు వదులుకుని రాజ్యసభను ఎంచుకోవడానికి కారణం అక్కడ అవలీలగా బీజేపీ గెలుస్తుందని ఆ పార్టీ అగ్రనేతలు భావించడమే. 'అక్కడ కుక్కను నిలబెట్టినా బీజేపీ గెలిపించుకుంటుంది..' అని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పాట్నా ఎంపీ వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం....

అయితే బీజేపీ ఓటు శాతం ఒక్క ఏడాదిలోనే 62శాతం నుంచి 34.4శాతానికి పడిపోయింది! బంకిపూర్ ఓటర్లలో 14శాతం మంది కాయస్థులే కావడంతో నితిన్ నబీన్ అక్కడి నుంచి గెలిచేవారు.

**పట్ట. హరి ప్రసాద్, రైటర్**
**ఫోన్: 8790 84 3009**

# 280 వారాలుగా నిరంతర అన్నదానం

**- సంగెం చారిటబుల్ ట్రస్ట్ సేవలకు నిదర్శనం**



ఆదిలాబాద్, ఆగస్టు 9 పేదలు, నిరుపేదలకు అండగా నిలుస్తూ సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరంతర అన్నదానం కార్యక్రమం ఆదివారంతో 280 వారాలకు చేరుకుంది. ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహిస్తూ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ వారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ అంబయ్య పాల్గొన్నారు. పేదలకు స్వయంగా అన్నదానం చేసి, సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 280 వారాలుగా నిరాటంకంగా కొనసాగుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు, న్యాయవాది డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం మాట్లాడుతూ పేదలకు ఆహారం అందించడాన్ని సామాజిక బాధ్యతగా భావించి అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాదవపూరి హిల్స్ లో ఘనంగా బోనాల వేడుకలు..

అమీన్ పూర్, ఆగస్టు 09; అమీన్ పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని పి.జి.ఆర్. ఎన్క్లేవ్ మరియు మాదాపూర్ హిల్స్ కాలనీలలో మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహాదేవ్ రెడ్డి ప్రత్యేక చొరవ, ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో కాలనీ మహిళలు భారీ సంఖ్యలో కదలివచ్చి బోనాలతో సందడి చేశారు. కాలనీ నుంచి శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం వరకు సాగిన ఈ ఊరేగింపులో మహిళలు బోనం ఎత్తుకుని, మారుమోగుతున్న డప్పు చప్పుళ్లకు తగినట్లుగా ఆటపాటలతో కోలాహలంగా సాగారు. ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఘనంగా ఆలయ ప్రస్థానాన్ని గుర్తుచేసిన మహాదేవ్ రెడ్డి..**




ఈ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహాదేవ్ రెడ్డి ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు మూడేళ్ల క్రితం తాము సంకల్పించి ఈ అమ్మవారి ఆలయాన్ని నిర్మించుకున్నామని గుర్తుచేశారు. దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పవిత్ర ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ అందించిన సహకారాన్ని కొనియాడారు. తోటి కౌన్సిలర్లు, ప్రజాప్రతిని ధులు మరియు కాలనీవాసులు అందరూ ఒక కుటుంబంలా ఐకమత్యంగా కష్టపడటం వల్లే ఈ అద్భుతమైన ఆలయ నిర్మాణం సాధ్యమైందని మహాదేవ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దలు, కాలనీ వాసులు, కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై ఆదోనిలో ఉద్రిక్త పరిస్థితులు -

తిరుమలగిరి:మెగా డీఎస్సీ మంట కర్నూలు జిల్లా ఆదోనిలో ఉద్రిక్తలను రాజేసింది. డీఎస్సీపీపై వైఎస్సార్సీపీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలపై చర్చకు సిద్ధమంటూ బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి సవాల్ విసిరారు. పూర్తివివరాలు ఇస్తామంటూ సాయంత్రం వైఎస్సార్సీపీ కార్యాలయానికి ఎమ్మెల్యే బయలుదేరారు. అప్రమత్తమైన పోలీసులు బీజేపీ, వైఎస్సార్సీపీ కార్యాలయాల వద్ద భారీగా బలగాలను మోహరించారు. పోలీసుల నుంచి తప్పించుకున్న పార్థసారథి కార్యకర్తలతో కలిసి వైఎస్సార్సీపీ కార్యాలయంవైపు నడుచుకుంటూ వెళ్తుండగా తిరుమలగిరి నగర్‌లో అడ్డుకున్నారు. దీంతో కొంత తోపులాట జరిగింది.ంతకుముందు ఆదోని పట్టణ ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే పార్థసారథి ఎస్‌కేడీ కాలనీలోని వైఎస్సార్సీపీ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. ఎమ్మెల్యే వెనక్కి తగ్గకుండా గృహ నిర్బంధాన్ని ఛేదించుకుని, పాదయాత్రగా నడుచుకుంటూ రహదారిపైకి వచ్చారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు కదిలి రావడంతో పోలీసులు ఆర్ట్స్ కళాశాల రహదారిపై భారీకేడ్లను అడ్డుగా పెట్టి ఎమ్మెల్యేను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు
# ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట :** శివ్వంపేట మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన గోమారం గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారుపాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, వాకిటి హనుమంతు రెడ్డి, కుంట లక్ష్మణ్, బిక్షపతి రెడ్డి, నవీన్, దేవేందర్, నగేష్, విజయ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలు జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు కేటీఆర్




ప్రకృతి పరిరక్షకులు, విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఆదివాసీలు అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడవులను, చెట్లను, పుట్టలను, జంతువులను ప్రేమించే, పూజించే ఆదివాసీలు... 'జల్, జంగల్, జమీన్' అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు అని తెలిపారు.ఎస్టీల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఆ తర్వాత ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.. తండాలను, గిరిజన గూడేలను గ్రామ పంచాయితీలు చేసిందని అన్నారు..హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో ఆదివాసీ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా.. కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం పేరు పెట్టడమే కాకుండా, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.తండాలకు, గూడేలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా చేయడం, ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో కార్యక్రమాలు కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా..

ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మావోయిజం లేదు డ్రగ్స్ సమస్యే నేడు ప్రధానం డీజీపీ సీవీ ఆనంద్



**వరంగల్ :** రాష్ట్రంలో మావోయిస్టుల ప్రముఖులతో పాటు క్యాడర్ లొంగిపోవడంతో మావోయిజం ప్రభావం ఇక లేదని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేడు డ్రగ్స్ సమస్య ప్రధానంగా ఉందని వెల్లడించారు. ఆదివారం వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.తన ట్రైనీ ఐపీఎస్ వరంగల్ నుంచే ప్రారంభమయ్యిందని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఇంటి నుంచి బయటకు వెళ్తే, తిరిగి వస్తామా అన్నంతగా నక్సల్స్ ప్రభావం ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2010 నుంచి మావోయిజం తగ్గిందని అన్నారు. లొంగిపోయిన మావోలతో ములుగులో సోమవారం ఒక కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. లొంగిపోయిన, మావో బాధితుల కోసం ఒక ఆప్ తయారు చేశామని వెల్లడించారు. 1992-96 మధ్య చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియా కొంత తక్కువ వచ్చిందని తమ దృష్టికి వచ్చిందని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

నార్కొటిక్ బ్యూరో, ట్రాఫిక్, సీఐడీకి చెందిన వారితో కలిసి ఒక బృందంగా ఏర్పడి జిల్లాల పర్యటనలు చేస్తున్నామని డీజీపీ ఆనంద్ తెలిపారు.

## మీకోసం అసెంబ్లీలో కొట్లాడతాం మీరు ఈ ప్రభుత్వ ద్రోహాన్ని గమనించండి విద్యార్థులతో హరీశ్‌రావు



**సిద్దిపేట:** నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు అవార్డులు అందజేసి, వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడు తూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీ వన్ రామ్ లాంటి మహనీయులు కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనమంతా చదువుకుని ఉన్న త స్థానాల్లో ఉన్నామని తెలిపారు. ఆ రిజ ర్వేషన్ల ఫలాలతో గౌరవంగా బతుకుతున్న మనం తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయా లనే బాధ్యతను పదేళ్ల క్రితమే గుర్తించి సిద్ది పేటలో మాదిగ సామాజిక వర్గం ఉద్యో గులంతా కలిసి 'న్యూస్' సొసైటీని స్థాపించడం అభినందనీయమని కొనియాడా రు.నాకు సమాజం ఏం చేసింది అని అడిగేవాళ్లే ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో, మేము సమాజానికి ఏం చేయగలం అని ఆలోచించి, ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయలు పక్కనపెట్టి 10 లక్షల రూపాయల నిధిని ఏర్పాటు చేయడం గర్వ కారణమని హరీశ్‌రావు అన్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు అండగా నిలబ డుతూ, ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్స్ ఇవ్వడం రాష్ట్రానికే ఆదర్శమని అన్నారు. ఐదే ళ్ల క్రితం ఫీజు కట్టలేక నా దగ్గరకు వచ్చిన హౌసింగ్ బోర్డుకు చెందిన రోహిత్ అనే అబ్బాయికి నేను సహాయం చేశానని తెలి పారు. ఇప్పుడు ఆ అబ్బాయికి ఏడాదికి 6 లక్ష ల జీతం వస్తోందని పేర్కొన్నారు. ఇచ్చాడని అన్నారు. కష్టపడి పైకొచ్చిన ఆ అబ్బాయి ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

## సీనియర్ సిటిజన్లే టార్గెట్‌గా సైబర్ కేటుగాళ్ల
### కొత్త మోసాలకు పాల్పడుతున్నారు సీపీ సజ్జనార్



**గద్వాల:** మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగుముఖం పట్టడంతో ఆల్మట్టి, నారాయణ పూర్ డ్యాంలో నుంచి జూరాల డ్యాంకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో జూరాల గేట్లు మూసి వేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అయితే జూరాల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 80000 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 39 608 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318. 516 మీటర్లు కాగా ప్రస్తుతం 317. 51 మీటర్లుగా నమోదయింది. టీఎంసీలలో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7. 663 టీఎంసీలు ఉంది. వరదలు తగ్గుముఖం పట్టడంతో జూరాల గేట్లు మూసివేశారు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

## శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద



**శ్రీశైలం:** శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. జూరాల నుంచి శ్రీశైలానికి 36,233 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయం ప్రస్తుత నీటిమట్టం 878.20 అడుగులు. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి నిల్వ 178 టీఎంసీలు కాగా, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు. అధికారులు విద్యుత్ ఉత్పత్తి చేసి 38,369 క్యూసెక్కులను విడుదల చేశారు.

## ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పుడు విధానాలకు పాల్పడితే సహించం మాజీ ఎమ్మెల్యే



**సూర్యపేట :** వ్యక్తిగత కక్షలు రాజకీయ కారణాలతో మిగిలిన డబుల్ బెడ్ రూంఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియల్లో తప్పుడు విధానాలకు పాల్పడితే చూస్తూ ఊరుకో బోమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వెల్లడించారు. ఆదివారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు సంవత్సరాల అనంతరం బాలాజీ నగంలోని 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 548 లబ్ధిదారులకు అధికారులు పట్టాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇక మిగిలిన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలని ఆకాంక్షతో తాను శాసనసభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో పారదర్శకంగా కలెక్టర్ పర్యవేక్షణలో లబ్ధిదారులు ఎంపిక పూర్తి చేశానని తెలిపారు.అయితే అధికారుల నిర్లక్ష్యంతో పలు సాంకేతిక కారణాల దృష్ట్యా పట్టాలు పంపిణీ చేయలేకపోయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాము తక్షణమే మౌలిక వసతులు పూర్తి చేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని పలు మార్లు ఆందోళన చేశామన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నడుస్తుందని నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్ కే నయీమ్, కౌన్సిలర్ చీమ నరేష్, ఉపేందర్ గౌడ్, అలవాల వెంకట్, ఉపేందర్, కరీముల్లా పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో 54 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత నలుగురు అరెస్టు

**యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీగా మెఫెడ్రోన్ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీబీనగర్ పోలీసులు, ఎస్‌వోటీ యాదాద్రి-భువనగిరి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 27 కిలోల మెఫెడ్రోన్‌ను పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.54 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో నలుగురిని అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు వెల్లడించారు.

యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు డ్రగ్స్ అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందడంతో ఆగస్టు 8న కొండమడుగు గ్రామ శివారులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎ-49-జెఔ-1313 నంబరు గల ఫార్చ్యూనర్ కారును ఆపి తనిఖీ చేయగా 27 కిలోల మెఫెడ్రోన్‌తోపాటు సుమారు 40 కిలోల అసిటోన్ లభించింది.పోలీసుల విచారణలో కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లో ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు మెఫెడ్రోన్‌ను అక్రమంగా తయారు చేసినట్లు వెల్లడైంది. అనంతరం దాన్ని కొండమడుగు నుంచి నాగ్‌పూర్‌కు తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల సమాచారంతో పోలీసులు వేటుకూరి ల్యాబ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ తయారీలో ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత ల్యాబ్‌ను సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



**నలుగురి అరెస్టు**

అరెస్టయిన వారిలో మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన చేతన్ మధుకర్ మెశ్రామ్ (49), అసోంలోని మారిగావ్‌కు చెందిన ముజామల్ హక్ (25), నాగ్‌పూర్‌కు చెందిన ఆకాశ్ అశో క్ గవాండే (31), హైదరాబాద్ చందా నగర్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తి (65) ఉన్నారు.చేతన్ డ్రగ్ తయారీకి ఆర్గనైజర్‌గా, ఆర్థిక సహకారం అందించిన వ్యక్తిగా.. ముజామల్ హక్ తయారీ ప్రక్రియలో సహ కరించిన వ్యక్తిగా.. ఆకాశ్ గవాండే అక్రమ రవాణాలో సహకరించిన వ్యక్తిగా.. రమణ మూర్తి వేటుకూరి ల్యాబ్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు.

**మరో నలుగురి కోసం గాలింపు**

ఈ కేసులో ఎం.డి. అయూబ్ అలీ (అసోం), చందా ప్రదీప్ ఠాకూర్ (నాగ్‌పూర్), గోపాల్ సిర్పట్ పటేలియా (నాగ్‌పూర్), యేటుకూరి రామరాజు (పీర్జాదిగూడ, మేడిపల్లి) పరారీలో ఉన్నారు. వీరిలో అయూబ్ అలీ ల్యాబ్ ఏర్పాటు, ముడి పదార్థాల సమీకరణ, కెమిస్ట్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించినట్లు.. ప్రదీప్ ఠాకూర్, గోపాల్ పటేలియా డ్రగ్ పెడ్లర్లుగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. యేటుకూరి రామరాజు ల్యాబ్ యజమానిగా ఉన్నట్లు తెలిపారు.

**భారీగా స్వాధీనం**

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 27 కిలోల మెఫెడ్రోన్, 40 కిలోల అసిటోన్ లిక్విడ్, ఆరు సెల్‌ఫోన్లు, ఫార్చ్యూనర్ కారు, డ్రగ్ తయారీకి ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్, ఇతర పరికరాలు ఉన్నాయి. ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనలకు అనుగుణంగా, పంచుల సమక్షంలో చట్టపరమైన ప్రక్రియను పాటిస్తూ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

**డ్రగ్స్‌పై కఠిన చర్యలు: ఎస్పీ**

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. కాపాడటం అందరి బాధ్యతన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం
## తిరుపతికి చెందిన యువకుడు మృతి



**అమెరికా:** అమెరికాలో విషాదం నెలకొంది. ఒహాయో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్‌లో జరిగిన యాక్సిడెంట్‌లో ఏపీకి చెందిన తెలుగు విద్యార్థి మృతిచెందాడు. అతను ప్రయాణిస్తున్న కారును ఓ పికప్ ట్రక్కు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.
వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం జెట్టివారిపాలెం గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ కొన్నేళ్ల క్రితం ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే ఈ ప్రమాదంపై న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. దిలీప్ కుమార్ అకాల మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని తెలిపింది. దిలీప్ కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. మృతదేహాన్ని వీలైనంత తొందరగా స్వగ్రామానికి చేర్చేలా ప్రయత్నాలు చేస్తున్నా మని చెప్పారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతూ
# మెడికో విద్యార్థి ప్రియాంక మృతి

**హైదరాబాద్ :** మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కారుతో ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మెడికోవిద్యార్థి ప్రియాంక ఆదివారం సాయంత్రం మృతి చెందింది. గత వారం రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆమె పరిస్థితి మరింత విషమించి మృతి చెందింది. ఏపీలోని రాజమహేంద్రవరంలో ఈనెల 3న రాత్రి సినిమామాల్ నుంచి తన స్నేహితుడితో బయటకు వచ్చిన ప్రియాంక వాహనాన్ని మద్యం మత్తులో ఉన్న దస్వంత్, ఆండ్రూ జోసఫ్ కారుతో ఢీ కొట్టారు. దీంతో ప్రియాంక తలకు తీవ్ర గాయాలతో ఆమెను స్థానిక ఆసుపత్రిలో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆమెకు వైద్యులు వెంటి లేటర్‌పై చికిత్స అందజేశారు. ఆమెను బతికించేందుకు వైద్యులు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ ఆరోగ్యం సహకరించక పోవడంతో ఆమె తుదిశ్వాస విడిచింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను పోలీ సులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధిం చింది.




## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ
## ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో భక్తులు



**తిరుమల :** గోవిందా హరి గోవిందా.. గోకుల నందా గోవిందా అంటూ తిరుమల లో భక్తులు స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో క్యూలైన్‌లలో నిలబడ్డారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో శని, ఆదివారాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయి ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. వేంకటేశ్వరస్వామిని 87,658 మంది భక్తులు దర్శించుకోగా 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు చెల్లించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.13 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ ఆలయ అధికారులు తెలిపారు.
4.15 లక్షల లడ్డూలను విక్రయించామని, 3.09 లక్షల మందికి అన్న ప్రసాదం అందించామని వివరించారు.

## నాటు బాంబులు వేసి చోరీకి యత్నం
## అడ్డుకున్న వాచ్‌మెన్ దారుణ హత్య



**చిత్తూరు జిల్లా** ఏపీలోని చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అర్ధరాత్రి నాటు బాంబులు వేసి ఫాంహౌస్‌లో దోపిడీకి ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రూరు గ్రామీణ మండలం మంగాపురానికి చెందిన పట్టాభి నాయుడు అమెరికాలో స్థిరపడ్డాడు. ఆయన స్వగ్రామంలో ఉన్న మామిడి తోటలో ఫాంహౌస్ నిర్మించుకున్నాడు. దానిని తన చెల్లి విజయ, బావ వెంటకేష్ నాయుడు చూస్తున్నారు. కాగా, అర్ధరాత్రి ఫాంహౌస్‌లోకి చొరబడిన దుండగులు రెండు కుక్కలకు మత్తు మందు ఇచ్చి చోరీకి ప్రయత్నించారు. ఈ క్రమంలో వాచ్‌మెన్ ఆనందరావు(52) అడ్డుకోవడంతో గొంతుకోసి హతమార్చారు. అనంతరం కిటికీపై నాటు బాంబులు వేశారు. భయపడిపోయిన విజయ దంపతులు గట్టిగా అరవడంతో దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహిళా ఎస్ఐపై దాడి కేసు వైసీపీ నేత చింతాడ
## రవికుమార్‌కు ఆగస్టు 21 వరకు రిమాండ్



**శ్రీకాకుళం:** మహిళా ఎస్ఐపై దాడి కేసులో వైసీపీ నేత చింతాడ రవికుమార్‌కు ఆగస్టు 21వ తేదీ వరకు శ్రీకాకుళం కోర్టు రిమాండ్ విధించింది. 13 రోజుల పాటు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అనంతరం రవికు మార్‌ను జిల్లా జైలుకు పోలీసులు తరలిం చారు. అతడిని రోడ్డుపై నడిపించుకుంటూ శ్రీకాకుళం కోర్టుకు పోలీసులు తీసుకుచ్చారు. పాతపట్నంలో వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో పోలీసులు హాజరుపరిచారు. మహిళా ఎస్ఐపై దాడి చేసిన కేసులో నిన్న చింతాడరవిని పోలీసులుఅరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## శ్రీశైల మల్లన్న భక్తులకు అలర్ట్
## ఆ సేవలు నిలిపివేత




**నంద్యాల:** శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవుల నేపథ్యంలో భక్తులు భారీగా ఆలయానికి తంలివచ్చి స్వామివారిని దర్శించుకుంటు న్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో స్వామివారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతుంది. అలాగే, వరుణయాగం సందర్భంగా ఈరోజు , ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనాలు నిలిపివేశారు. భక్తుల వాహనాలు ఎక్కువగా రావడంతో శ్రీశైలంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో శ్రీశైలం రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీశైలం టోల్‌గేట్ నుంచి ముఖ ద్వాంం వరకు వాహనాల రాకపోకలు స్తంభి ంచాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు పడు తున్నారు.

# అరాచకాలు అక్రమాలు చేసే వైసీపీ
# కనుమరుగైపోయింది మంత్రి డీబీవీ స్వామి




**ప్రకాశం జిల్లా :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీలో వైసీపీ నేతలు నానాయాగి చేస్తున్నారని ధ్వజమెత్తారు. డీఎస్సీ అడ్డుకోవడం కోసం 350కు పైగా కేసులను వైసీపీ నేతలు వేశారని ఆగ్రహించారు. ఆ కేసులన్నీ కోర్టులు పరిష్కరించాయని వెల్లడించారు. ఈరోజు పకాశం జిల్లాలో మంత్రి డీబీవీ స్వామి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎప్పుడు డీఎస్సీ ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలోనే ఇచ్చామని వ్యాఖ్యానించారు.
9 నెలలు ఉద్యోగాలు చేసిన తర్వాత ఏదో అన్యాయం జరిగిందని వైసీపీ నాయకులు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ఏపీ హైకోర్టు కూడా వైసీపీ నేత డీఎస్సీపై వేసిన పిల్‌ను కొట్టివేసిందని ప్రస్తావించారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం పెడితే అక్కడ కూడా తిరస్కరించారని చెప్పుకొచ్చారు. అన్యాయం జరిగిందని ఒక్క డీఎస్సీ అభ్యర్థి కూడా బయటకు రావడం లేదని.. కానీ డీఎస్సీపై ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులే ర్యాలీలు చేయడం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు.
వైసీపీ అక్రమాలపై ఉద్యోగస్తులు తిరగ పడుతున్నారని మంత్రి అన్నారు. అరాచకాలు, అక్రమాలు చేసే ఆ పార్టీ కనుమరుగైపో యిందని విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ రాజీనామా అడిగే ముందు వైసీపీ నాయకులకు అసలు బుద్ధుందా అని ప్రశ్నించారు. తలకిందులుగా తపస్సు చేసినా వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి డోలా బాల వీరాంజనే యస్వామి పేర్కొన్నారు.

# ఘోర విషాదం పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతి



**శ్రీకాకుళం:** జిల్లాలో ఇవాళ భారీ వర్షాలతో కూడిన పిడుగులు బీభత్సం సృష్టించాయి. మందస ఏజెన్సీ ప్రాంతంలోని పాతకోటలో పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతిచెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను కట్ట సుమిత్రి, సవర జోరాగా గుర్తించారు. బాధితులంతా వ్యవసాయ పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో పాతకోటలో విషాద ఛాయలు అలుముకోగా.. మృతుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వాతావరణం మారింది. శ్రీకాకుళం జిల్లాతో పాటు పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు.

## తెల్ల దుస్తులు ధరించి ఏనుగులకు
## కనిపించొద్దు డీఎఫ్‌వో ప్రసన్న



**బొబ్బిలి:** విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామ చెరువులో అడవి ఏనుగుల గుంపు తిష్టవేసింది. ఈ మేరకు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. తెల్లని దుస్తులు ధరిస్తే గజరాజులకు కనిపించకుండా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. వాటిని గ్రామాల నుంచి దూరంగా తరిమేందుకు శిక్షణ పొందిన కుంకి ఏనుగులను రంగంలోకి దించినట్లు డీఎఫ్‌వో ప్రసన్న పేర్కొన్నారు. వాటిని చూడగానే అడవి ఏనుగులు భయంతో పరుగులు తీస్తున్నట్లు గుర్తించామన్నారు. శిక్షణ పొందిన ఏనుగుల సహాయంతో అడవి ఏనుగులను మచ్చిక చేసే పరిస్థితిని కల్పిస్తున్నామని డీఎఫ్‌వో ప్రసన్న తెలిపారు. ప్రస్తుతం పిరిడి చెరువు పరిసర ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను అటవీశాఖ సిబ్బంది నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. గ్రామాల వైపు అవి రాకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు ఏనుగులు సంచరిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో సూచించారు. ఏనుగులు కనిపించినప్పుడు వాటి వద్దకు వెళ్లడం, ఫొటోలు లేదా వీడియోల కోసం దగ్గరగా వెళ్లడం చేయరాదని హెచ్చరించారు. గుంపుగా వెళ్లి ఏనుగులను తరిమేందుకు అందించాలని డీఎఫ్‌వో ప్రసన్న సూచించారు.


## ఆదివాసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబే
## ప్రధాన కారణం మంత్రి సంధ్యారాణి



**విజయవాడ:** నేడు ఆదివాసీలు గౌరవంగా జీవిస్తున్నారంటే అందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాన కారణమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అనేది గతంలో ఎవరూ చూడలేదన్నారు. సీఎం చంద్రబాబు వచ్చాకే.. ఆదివాసీ దినోత్సవం సంబరంగా జరుగుతుందని గుర్తు చేశారు. నేడు గిరిజనులు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, తరువాత చంద్రబాబు హయాంలోనే గిరిజనులకు మేలు జరిగిందని చెప్పారు. స్కూల్ అఫ్ ఎక్సలెన్సీ, కాలేజీ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా రెండు లక్షల మంది గిరిజనులు చదువుకొంటున్నారని వివరిం చారు. నేడు ప్రతి క్లాస్‌కి ఓ టీచర్ ఉన్నారంటే అందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కారణమని పేర్కొన్నారు. యాభై ఏళ్లకే గిరిజనులకు సీఎం చంద్రబాబు పెన్షన్ ఇచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 18 పథకాలను రద్దు చేసి గిరిజనులు పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ సీఎంగా చంద్రబాబు వచ్చాక ఆ 18 పథకాలను మళ్లీ అమలు చేశారని చెప్పారు. ఈ రెండేళ్లల్లో రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదార్లు, మౌలిక సౌకర్యాలు కల్పించారని చెప్పారు. ఫీడర్ అంబులెన్స్‌ల సృష్టికర్త చంద్రబాబు అని అన్నారు.

# 17 ఏళ్లకే రూ.3.5 కోట్ల స్కాలర్‌షిప్ అమెరికాలో ఫ్రీగా చదువుకునే ఛాన్స్ కొట్టేసిన తమిళనాడు విద్యార్థి

**అమెరికా:** అమెరికాలో చదువుకోవాలనేది ఇండియాలోని లక్షల మంది డ్రీమ్. అక్కడి యూనివర్సిటీల్లో అడ్మిషన్ దొరకడమే కష్టం. ఒకవేళ దొరికినా బోలెడంత డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చాలా కుటుంబాలకు ఇది భారం. అలాంటిది తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ఒక విద్యార్థి అమెరికాలోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటైన బ్రౌన్ యూనివర్సిటీలో చదువుకునే ఛాన్స్ కొట్టేశాడు. అది కూడా రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్‌తో. అంటే.. నాలుగేళ్ల చదువు పూర్తి ఉచితం. ఈ ఘనత సాధించింది తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన ప్రణవ్ ఇలాంగో అనే 17 ఏళ్ల విద్యార్థి.

ప్రణవ్‌కు చాలాకాలంగా విదేశాల్లో.. అందులోనూ అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో చదువుకోవాలనే కోరిక ఉండేది. దీనికి అనుగుణంగా అతడు 13 ఏళ్ల వయసు నుంచే అక్కడి యూనవర్సిటీల్లో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌ల ప్రక్రియ గురించి తెలుసుకున్నాడు. ఇదే సమయంలో తన అకడమిక్, టెక్నికల్ స్కిల్స్ కూడా పెంచుకున్నాడు. దీనిలో భాగంగా డెక్స్‌టెరిటీ గ్లోబల్ నేషనల్ స్కాలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో చేరాడు. తన నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. మ్యాథమెటిక్స్, పబ్లిక్ హెల్త్‌ను కలపాలన్న తన ఆలోచనకు అనుగుణంగా చదువుకున్నాడు. ఇదే అంశంలో అతడు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో ప్రతిభ కనిబరిచాడు. రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్ గెలుచుకున్నాడు. 8 ప్రైవేటు యూనివర్సిటీలతో కలిపి ఐవీ లీగ్ యూనివర్సిటీ పేరిట చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రణవ్ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపి దీని ప్రకారం ప్రణవ్ నాలుగేళ్లపాటు బ్రౌన్ యూనివర్సిటీలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్స్ చేసేందుకు అనుమతి, సహకారం లభిస్తుంది. ఈ రూ.3.55 కోట్లను యూనివర్సిటీలో చదువుకు, అక్కడ ఉండటానికి, ఇతర ఖర్చులకు కేటాయిస్తారు.

అంటే ట్యూషన్ ఫీజుతో పాటు, నివాస ఖర్చుల కింద నాలుగేళ్లపాటు ఈ మొత్తాన్ని అందిస్తారు.

దీంతో అతడు అక్కడ ఎలాంటి ఖర్చూ లేకుండా చదువు కోవచ్చు.

# లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అనుమానాస్పద మృతి



పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ కమాండర్ ఖారీ సయీద్ అబ్దుల్ అజీజ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. లష్కరేకు చెందిన ముసుగు సంస్థ జమాత్ ఉద్ దవాలో ఇతడు కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రార్థనామందిరం ప్రవేశ ద్వారం వద్ద అతడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆ తర్వాత కోలుకో లేదు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగానా, లేదా విషప్రయోగం కారణంగా మరణించాడా అనేది కచ్చితంగా తెలియరాలేదు. అబ్దుల్ అజీజ్ జమ్ముకశ్మీర్‌లో ప్రవేశించే ఉగ్రవాదులకు సేఫ్ హౌసలు, ఆర్థిక సాయం, తప్పుడు పత్రాలు సమకూర్చడం వంటివి చేస్తుంటాడు. నీలమ్ వ్యాలీ, ముజఫరాబాద్ మీదుగా ఉగ్రవాదులను పంపుతుంటాడు. ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయం సమకూర్చడం కూడా ఇతడి బాధ్యత. ఇటీవల లష్కరేకు చెందిన సభ్యుడు రిజ్వాన్ హనీఫ్ ఓ వీడియో విడుదల చేశాడు. తమ సంస్థకు చెందిన 30 మంది సభ్యులను గురుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఆరోపించాడు. వీరంతా గత నాలుగేళ్లలో పాక్, పీవోకేలో మరణించినట్లు పేర్కొన్నాడు. ఇటువంటి హత్యలు జరుగుతున్నట్లు లష్కరే బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి.

# పీజీ హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థిని మెడకు వైరు చుట్టి సెక్యూరిటీ గార్డు అత్యాచారం

**గాంధీనగర్:** ఒక విద్యార్థిని పీజీ వసతి గృహంలో నివసిస్తున్నది. రాత్రి వేళ వాకింగ్ కోసం టెర్రస్‌పైకి ఆమె వెళ్లింది. అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ యువతి మెడకు వైరు బిగించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి పారిపోయిన ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక యువతి ఇంటీరియర్ డిజైనింగ్ చదువుతున్నది. ఆనంద్‌నగర్ ప్రాంతంలోని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంలో ఆమె నివసిస్తున్నది. కాగా, ఆగస్ట్ 8న డిన్నర్ తర్వాత వాకింగ్ కోసం రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ బిల్డింగ్ టెర్రస్‌పైకి ఆ యువతి వెళ్లింది. అక్కడ సెక్యూరిటీ గార్డు ఉండటంతో కిందకు వచ్చేందుకు ఆమె ప్రయత్నించింది. అయితే సెక్యూరిటీ గార్డు ఆ మహిళ మెడకు వైరు చుట్టి బంధించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. గాయాలతో ఉన్న ఆ యువతిని గుర్తించి ఆసుపత్రికి తరలించి చికి




త్స అందిస్తున్నారు. మరోవైపు ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందిం చారు. పీజీ హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ సెక్యూ రిటీ గార్డుగా పనిచేస్తున్న ధరమ్ సింగ్‌ను నిం దితుడిగా గుర్తించారు. శనివారం రాత్రంగా వెతికిన పోలీసులు చివరకు ఆదివారం ఉదయం అతడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడు ధరమ్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాకు చెందిన వ్యక్తిని అని పోలీస్ అధికారి తెలిపారు. కొద్ది రోజుల కిందటే ఆ పీజీ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డుగా అతడు చేరినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు

# జేపీఎస్‌సీ పరీక్ష రద్దుకు సిద్ధం కీలక డిమాండ్లపై

## సానుకూలం విద్యార్థులు చర్చకు రావాలన్న సీఎం


జార్ఖండ్‌లో జేపీఎస్‌సీ-జేఎస్‌ఎస్‌సీ పరీక్షలు రద్దు చేయాలంటూ విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఈ అంశంపై ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి విద్యార్థులతో చర్చిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ పాల్గొన్నారు. విద్యార్థుల ఆందోళనపై మాట్లాడారు. "జేపీఎస్‌సీ-జేఎస్‌ఎస్‌సీ పరీక్షల అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. పేపర్ లీకేజీ అంశంలో అవకతవకలకు పాల్పడిన నింది తుల్ని గుర్తించాం. వారికి కఠిన శిక్షలు పడతాయి. జార్ఖండ్‌కు చెందిన అన్ని వర్గాల ప్రజలు, యువత ఆందోళనల్ని మేం పరిగణనలోకి తీసుకుంటాం. బల ప్రయోగం చేయడం, సైన్యాన్ని, బుల్లెట్లు వాడటంకంటే చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమవుతుందని మేం నమ్ముతాం. " అని హేమంత్ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు ప్రభావితం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. విద్యార్థులు తమ హక్కులు సాధించుకునేందుకు రాజకీయ జోక్యాన్ని నివారించాలని, రాజకీయ పార్టీలు విద్యార్థుల్ని తప్పుదోవపట్టిస్తాయని ఆయన సూచించారు. ఈ పేపర్ లీకేజీలకు సంబంధించి ప్రధానంగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్న కీలక విషయం.. ఇటీవల నిర్వహించిన పరీక్షను పూర్తిగా రద్దు చేయడం. రెండోది వీటిపై సీబీఐ విచారణ జరిపించడం. వీటిలో పరీక్షల రద్దుకు ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సీబీఐ విచారణకే ప్రభుత్వం అంగీకరించడం లేదు. మరోవైపు.. సీఎం మాటల్ని నమ్మి, ప్రభుత్వంతో విద్యార్థులు మళ్లీ చర్చలు జరపాలని జార్ఖండ్ గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ కోరారు. సీఎం హామీపై విశ్వాసం ఉంచాలని ఆయన సూచించారు. విద్యార్థుల భవిష్యత్ విషయంలో ప్రభుత్వం వెనుకంజ వేయదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆందోళన 16వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో విద్యార్థులతో మరోసారి చర్చలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.



# లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐకి ఆహ్వానం వ్యతిరేకిస్తూ 450 మంది విద్యార్థుల సంతకాలు

**హైదరాబాద్:** హైదరాబాద్ లోని ప్రముఖ నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవం అంశంపై వివాదం మొదలైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌ను యూనివర్సిటీ ఆహ్వానించింది. అయితే, సీజేఐని ఆహ్వానించడాన్ని ఇక్కడి విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీకి 450 మంది విద్యార్థులు లేఖ కూడా రాశారు. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవం ఇటీవల జరగాల్సి ఉంది. 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న లా విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేసే స్నాతకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి యూనివర్సిటీ ఏర్పాట్లు చేసింది.

దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వర్గాలు గత నెలలో ఆహ్వానించాయి. అయితే, స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించడాన్ని యూనివర్సిటీకి


చెందిన అత్యధిక మంది విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. దీనికి కారణం గత నెలలో జరిగిన పరిణామాలు. జూలై 20న సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళన సందర్భంగా అనేక మంది విద్యార్థులు గాయపడ్డారు. వాటికి సంబంధించి సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. ఈ కేసుల విషయంలో సీజేఐ వ్యవహరించిన తీరును నల్సార్ విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థుల తరపు వాదనల్ని సీజేఐ సరిగ్గా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించకూడదని నల్సార్ విద్యార్థులు నిర్ణయించారు. ఆయన చేతుల మీదుగా డిగ్రీ పట్టాలు తీసుకోవడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై 450 మంది విద్యార్థులు.. తమ సంతకాలతో యూనివర్సిటీ వీసీకి లేఖ రాశారు. స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని వారు లేఖలో కోరారు. ఆయన రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. వీసీ సహా అధికారులతో ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధమన్నారు. వీరి లేఖ కారణంగానే ఈ కార్యక్రమం వాయిదా పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సీజేఐని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తే ఆందోళనలు, ఘర్షణ తలెత్తే అవకాశం కూడా ఉందని సమాచారం. అయితే, స్నాతకోత్సవానికి సంబంధించిన డేట్ ఇంకా ఖరారు కాలేదనే మరో ప్రచారం కూడా జరుగుతోంది. ఇక, ఈ అంశంపై ఇప్పటివరకు నల్సార్ యూనివర్సిటీ అధికారికంగా స్పందించలేదు.

# నేను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనా దేశంగా ఉండదు

## ట్రంప్ ప్రతిపాదన తిరస్కరించిన నెతన్యాహు



తాను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనా దేశంగా ఉండబోదని స్పష్టం చేశారు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు. ఈ అంశంలో ట్రంప్ ప్రతిపాదనను కూడా నెతన్యాహు తిరస్కరించారు. ఇది ట్రంప్‌నకు పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పాలి. గాజాపై ఇజ్రాయెల్ చాలాకాలంగా దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 15 అంశాల ప్రణాళికతో ఒక రోడ్ మ్యాప్ ప్రకటించారు. హమాస్, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలన్నది వాటిలో ఒకటి. ఈ ప్రణాళికకు పాలస్తీనాతోపాటు, ఇతర గల్ఫ్ దేశాలు అంగీకరించాయి. ఇదే సమయంలో హమాస్ సంస్థ కూడా సానుకూలంగా స్పందించింది. అయితే, ఇజ్రాయెల్ తమ డిమాండ్లకు అంగీకరించాలని హమాస్ కోరింది. కానీ, ఈ ప్రతిపాదనను ఇజ్రాయెల్ పీఎం వ్యతిరేకించారు. ట్రంప్ ప్రతిపాదనకు అంగీకరించేది లేదన్నారు. తాను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించబోమన్నారు. గాజాలో లేదా వెస్ట్‌బ్యాంక్‌లో ఎక్కడా పాలస్తీనా దేశాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదనల్లో పాలస్తీనా దేశం ఏర్పాటు కూడా ఒకటి. అయితే, దీన్ని నెతన్యాహు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు.. ట్రంప్ ప్రతిపాదనను నెతన్యాహు వ్యతిరేకించడాన్ని 8 దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. యూఏఈ, ఖతార్, జోర్డాన్, ఇండోనేసియా, పాకిస్తాన్, తుర్కియే, సౌదీ అరేబియా, ఈజిప్ట్‌లు నెతన్యాహు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. గాజాలో ఇంకా ఎంతకాలం ఇజ్రాయెల్ దాడులు చేస్తుందని ప్రశ్నిస్తున్నాయి.

ఇజ్రాయెల్ ఈ శాంతి ఒప్పందానికి అంగీకరించకుంటే తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించాయి. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల్ని ఉపసంహరించేది లేదన్నారు. హమాస్ ఉగ్రవాదులు పూర్తి నిరాయుధులుగా మారేంతవరకు తమ దళాలు అక్కడే ఉంటాయన్నారు. ఇదే సమయంలో ఇరాన్‌పై కూడా భారీ దాడికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ఇజ్రాయెల్ సైన్యానికి సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ఇరాన్‌పై దాడికి ముందు కూడా ఇలాగే సెలవులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# కెనడాలో విజృంభిస్తున్న కార్చిచ్చు 20000 మందికి ముప్పు

## బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటన

కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా బ్రిటీష్ కొలంబియా ప్రాంతంలో కొనసాగుతున్న కార్చిచ్చు మరింత వేగంగా విస్తరిస్తోంది. వేల ఎకరాల అడవి తగలబడిపోతోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20,000 మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. కార్చిచ్చు వేగంగా విస్తరిస్తుండటం వల్ల బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటిం చామని అధికారులు తెలిపారు. అక్కడి అధికారుల వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు (30 మీటర్లు) ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి. ఇవి 200 అడుగుల వరకు



కూడా చేరుకునే అవకాశం ఉంది. పైగా ఈ మంటలు కృత్రిమ వాతావరణాన్ని సృష్టించి, మెరుపులు ఏర్పడేలా కూడా చేస్తుంది. కార్చిచ్చు విస్తరిస్తుండటంతో ఇప్పటికే భారీ ఆస్తి నష్టం జరిగింది. అనేక ఇళ్లు, కార్లు, ఆస్తులు కాలి బూడిదయ్యాయి. కొన్నిచోట్ల మంటలు వేగంగా వ్యాపించడంతో చాలా మంది మధ్యలో చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కొన్నిచోట్ల మంటలు మొదలవ్వగా, అర్ధరాత్రి వరకు భారీగా వ్యాపించాయి. శనివారం ఒక్క రోజే 9,500 హెక్టార్ల (23,500 ఎకరాలు)కు మంటలు వ్యాపించాయి. దీంతో 12,000 మంది పౌరులు ఇక్కడినుంచి తరలి వెళ్లాల్సి వచ్చింది. ముఖ్యంగా సమ్మర్‌ల్యాండ్‌లో మొదలైన కార్చిచ్చు చాలా ప్రమాదకరంగా మారింది. గత వారం నుంచి ఇక్కడ 70 చోట్ల కార్చిచ్చు వ్యాపించింది. అంతకుముందు వాటితో కలిపి 105 చోట్ల కార్చిచ్చు కొనసాగుతోందని బ్రిటీష్ కొలంబియా అటవీ శాఖ మంత్రి రవి పర్మార్ ప్రకటించారు. ఈ ఏడాదిలో కెనడాలో అనేకచోట్ల కార్చిచ్చు వ్యాపించి, భారీ నష్టాన్ని కలిగించింది.

2026లో 4 మిలియన్ల హెక్టార్లలో కార్చిచ్చు వ్యాపించి, వినాశనం సృష్టించింది. ముఖ్యంగా ఒంటారియో, క్యూబె క్ వంటి వేడిగా, పొడిగా ఉండే ప్రదేశాల్లోని అటవీ ప్రాంతాలు తగలబడిపోయాయి. కొన్నే ళ్లుగా దేశంలో కార్చిచ్చు ఘటనలు ఎక్కువగా జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

# అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి

## తామే చేశామని ప్రకటించిన హౌతీలు

సౌదీ అరేబియా లోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీ డ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పందనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపకసిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ దాడి ప్రపంచ




వ్యాప్తంగా ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. మూడు దేశాల్లో ఏదైనా ఒకదానిపై సాయుధ దాడి జరిగితే మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణించేలా ఒప్పందంలో పేర్కొన్నారు. ప్రాంతీయ భద్రతపై ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రాధాన్యం సంతరించుకుంది.

# మీ వయస్సు 40 దాటిందా అయితే ఈ
# పరీక్షలు తప్పక చేయించుకోవాలి

వయస్సు 40 ఏండ్లకు పైబడిన వారు తప్పనిసరిగా కొన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. నలభై ఏళ్ల తర్వాత శరీరంలో చాలా మార్పులు వస్తాయి. అందుకే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. దీనివల్ల కొన్ని రకాల అనారోగ్య సమస్యల ను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందే అవకాశం ఉంటుంది. దాంతో ఆరోగ్యంగా జీవించ గలుగుతాం. అయితే 40 ఏళ్ల తర్వాత తప్పని సరిగా చేయించుకోవాల్సిన ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు ఏవో ఇప్పుడు తెలుసు కుందాం..



**బ్లడ్ షుగర్ టెస్ట్**

ఒకప్పుడు వయస్సు పైబడిన వారు మాత్రమే మధుమేహం బారినపడే వారు. ఇప్పటి ఆహా రపు అలవాట్లు, ఉరుకులు పరుగుల జీవన శైలితో చిన్న వయస్సులోనే మధుమేహం బారి న పడుతున్నారు. అందుకే కనీసం 40 ఏళ్లు దాటిన తర్వాతనైనా ప్రతి ఒక్కరూ బ్లడ్ షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిది.

**కొలెస్ట్రాల్ టెస్ట్**

ఒకప్పటితో పోల్చిచూస్తే ఇప్పటి ఆహారపు అలవాట్లలో చాలా తేడాలు వచ్చాయి. జనం ఇన్‌స్టంట్ ఫుడ్స్‌కు బాగా అలవాటుపడ్డారు. దాంతో చిన్న వయస్సులోనే ఊబకాయం వస్తున్నది. రక్తంలో కొవ్వు శాతం పెరుగు తోంది. ఇది గుండె జబ్బులకు దారితీస్తుంది. అందుకే 40 ఏండ్లు దాటిన వారు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

**బీపీ టెస్ట్**

ప్రస్తుతం జీవనశైలి పూర్తిగా ఒత్తిళ్లతో కూడు కుని ఉన్నది. మనిషులు సంపాదన వేటలో పడి మానసిక ఒత్తిళ్లలో చిక్కుకుంటున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. సరైన విశ్రాంతి లేక బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులబారిన పడుతున్నారు. కొందరు ఆహారపు అలవాట్ల కారణంగా ఈ వ్యాధులు తెచ్చుకుంటున్నారు. కాబట్టి 40 ఏండ్ల తరచూ బీపీ పరీక్షలు చేయించకోవడం మంచిది.

**థైరాయిడ్ టెస్ట్**

బీపీ, షుగర్ మాదిరిగానే థైరాయిడ్ కూడా జీవనశైలి వ్యాధి. ఈ థైరాయిడ్‌లో హైపర్ థైరాయిడిజం, హైపో థైరాయిడిజం అని రెండు రకాలు ఉంటాయి. థైరాయిడ్ కారణ ంగా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే 40 ఏండ్లు దాటగానే థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం అవసరం.

**విటమిన్ లెవెల్స్ టెస్ట్**

మనం ఆరోగ్యంగా జీవించాలంటే శరీరానికి విటమిన్‌లు, ఖనిజాలు చాలా అవసరం. అయితే ఈ విటమిన్‌లు, ఖనిజాలు ఏదీ ఎంత మోతాదులో ఉండాలో అంతే ఉంటేనే ఆరో గ్యంగా ఉంటాం. లేదంటే అనారోగ్య సమ స్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే విట మిన్‌లు, మినరల్స్ సమపాళ్లలో అందేలా మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. అందు కోసం 40 ఏండ్ల పైబడిన వాళ్లు తరచూ విట మిన్ మోతాదులకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి.

**గుండె పరీక్షలు**

షుగర్, బీపీ, హైకొలెస్ట్రాల్ లాంటి జీవనశైలి వ్యాధులు క్రమంగా గుండె జబ్బులకు దారితీ స్తాయి. కొవ్వు కారణంగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నరాల్లో బ్లాక్స్ రావడం, అదే విధంగా గుండె కండరాలు బలహీనపడం లాంటి సమస్యలు గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి. అం దుకే 40 ఏండ్లు దాటిన వాళ్లు గుండె పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా ముఖ్యం.

**జాగ్రత్తలు**

పరీక్షలు చేయించుకోవడంతో ఏవైనా వ్యాధు లు బయటపడితే చికిత్స తీసుకోవాలి. లేదం టే ఆ వ్యాధి మరింత ముదిరిపోయే ప్రమాదం ఉంది.

అదేవిధంగా జబ్బులేమీ బయట పడలేవు కదా అని నిర్లక్ష్యంగా ఉంటే భవి ష్యత్తులో జబ్బులబారిన పడే ప్రమాదం ఉంది. కాబట్టి అలాంటి ప్రమాదం రావద్దంటే జీవ నశైలిలో తగిన మార్పులు చేసుకోవాలి. పం డ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. రోజూ వాకింగ్ లేదా తేలికపాటి వ్యాయామం చేయా లి. యోగా చేస్తే ఇంకా మంచిది. తగినంత నిద్ర పోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి.

# నడుము చుట్టుకొలత అధికంగా ఉండే మహిళలకు
## గుండె పోటు ప్రమాదం ఎక్కువ అధ్యయనంలో వెల్లడి

ఊబకాయం గుండె సంబంధిత అనేక సమస్య లకు కారణమవుతుందని ఇప్పటికే పలు అధ్య యనాలు సూచించాయి. అయితే శరీరంలో కొవ్వు ఏ ప్రాంతంలో ఎక్కువగా పేరుకు పోతుందన్న విషయం కూడా గుండె ఆరో గ్యంపై ప్రభావం చూపిస్తుందని తాజా అధ్య యనం వెల్లడించింది. ముఖ్యంగా నడుము, తుంటి చుట్టుకొలత ఎక్కువగా ఉన్న మహి ళల్లో గుండెపోటు వచ్చే ప్రమాదం అధికంగా ఉండే అవకాశాలు ఉంటాయని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం ఇంగ్లా ండ్, స్కాట్లాండ్, వేల్స్‌కు చెందిన 4,79,610 మంది ఆరోగ్య సమాచారాన్ని పరిశీలించారు. అధ్యయనం ప్రారంభంలో వారి వయస్సు 40 నుంచి 69 సంవత్సరాల మధ్య ఉండగా, సగటు వయస్సు 56 సంవత్సరాలుగా ఉంది. పాల్గొన్నవారిలో ఎక్కువ మంది అధిక బరువుతో ఉన్నప్పటికీ, అప్పటివరకు వారికి గుండె జబ్బుల చరిత్ర లేదు. సగటున ఏడేళ్ల పాటు వారిని పరిశీలించగా, ఈ కాలంలో 5,710 మంది గుండెపోటుకు గురైనట్లు గుర్తించారు.



**నడుము చుట్టుకొలత ఎక్కువగా ఉంటే..**

నడుము చుట్టుకొలత అసాధారణంగా ఎక్కువ గా ఉన్న మహిళల్లో గుండెపోటు ప్రమాదం మరింత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. అలాగే నడుము-తుంటి నిష్పత్తి ఎక్కువగా ఉన్న మహిళలు కూడా అధిక ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించారు. పురుష ల్లోనూ పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయే యాపిల్ షేప్ శరీరాకృతి కనిపించినప్పటికీ, ఇదే తరహా శరీరాకృతి ఉన్న మహిళలతో పోలిస్తే గుండెపోటు ప్రమాదం మహిళల్లో ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఊబకాయం గుండె జబ్బులకు ఒక ముఖ్య మైన ప్రమాద కారకమన్న విషయం ఇప్పటికే తెలిసిందే. అయితే శరీరంలోని వివిధ భాగా ల్లో కొవ్వు పేరుకుపోయే విధానం గుండె ఆరో గ్యంపై చూపే ప్రభావాన్ని ఈ అధ్యయనం మరింత స్పష్టంగా చూపించింది. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే కొవ్వు ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటు ందని పరిశోధకులు చెప్పారు. ఊబకాయం అంటే శరీరంలో అవసరానికి మించి కొవ్వు పేరుకుపోయే పరిస్థితి. అధిక బరువు, ఊబకాయం వల్ల గుండె జబ్బులతోపాటు మధుమేహం, కీళ్ల సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం కూడా పెరుగుతుందది. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే అంతర్గత కొవ్వు శరీరంలో వాపు వంటి ప్రక్ర ియలను ప్రేరేపించి, మధుమేహం, కరోనరీ ఆర్టరీ వ్యాధి వంటి సమస్యల ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.


**తెల్ల బియ్యం వద్దు..**

బరువును నియంత్రించుకోవాలనుకునేవారు శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లకు బదులుగా సం పూర్ణ ధాన్యాలను ఎంచుకోవడం మంచిది. బజ్రా, రాగి, మొక్కజొన్న, జొన్న వంటి సం పూర్ణ ధాన్యాలను ఆహారంలో తరచూ చేర్చు కోవచ్చు. తెల్ల బియ్యానికి బదులుగా ఎరుపు, నలుపు లేదా బ్రౌన్ రైస్‌ను ఎంచుకోవచ్చు. వీటిని అల్పాహారంలో గంజి రూపంలో కూడా తీసుకోవచ్చు. ధాన్యాల మాదిరిగానే పొట్టు తొలగించని సంపూర్ణ పప్పుధాన్యాలు కూడా ఆరోగ్యకరమైన ఎంపికగా ఉన్నాయి. రాజ్మా, శనగ పప్పు వంటి వాటిని ఆహారంలో చేర్చు కోవచ్చు. వీటిని కూరలుగా వండుకోవడ ంతోపాటు మొలకల రూపంలో లేదా సూప లలో కూడా తీసుకోవచ్చు. బరువు తగ్గే ప్రయ త్నంలో ఉన్నవారు రెడ్ మీట్‌కు బదులుగా కొవ్వు తక్కువగా ఉండే ప్రొటీన్ వనరులను ఎంచుకోవాలి. చికెన్, సాల్మన్ వంటి ఆహా రాలను తీసుకోవచ్చు. ప్రతి భోజనంలో తగి నంత ప్రొటీన్ ఉండేలా చూసుకోవడం బరువు నియంత్రణలో ఉపయోగకరంగా ఉంటుంది. ట్రాన్స్ ఫ్యాట్స్‌కు దూరంగా ఉండటం కూడా చాలా ముఖ్యం. ఫాస్ట్‌ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్, డీప్ ఫ్రైడ్ జంక్ ఫుడ్, కుకీలు, బర్గర్లు, నూడుల్స్, కొన్ని పాస్తా వంటి ప్రాసెస్డ్ ఆహారాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండే అవకాశం ఉంటుంది. వీటిని తరచూ తీసుకోవడం ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది.

**చక్కెర వాడకాన్ని తగ్గించాలి..**

చక్కెర వినియోగాన్ని కూడా పరిమితం చేయా లి. రోజువారీ మొత్తం కేలరీల్లో చక్కెర వాటా 10 శాతానికి మించకుండా చూసు కోవాలి. అంతకంటే 5 శాతం లోపులో ఉంచి తే మరింత మంచిది. మనం తీసుకునే అనేక ఆహారాల్లో సహజంగా ఉండే చక్కెరతోపాటు అదనంగా చేర్చిన చక్కెర కూడా ఉంటుంది. కనుక ఆహారాన్ని ఎంచుకునేటప్పుడు చక్కెర పరిమాణంపై కూడా శ్రద్ధ పెట్టడం అవసరం. అయితే ఈ అధ్యయనం పరిశీలనాత్మకమైనదే తప్ప నియంత్రిత ప్రయోగం కాదు. అంటే శరీర బరువు లేదా కొవ్వు ఏ ప్రాంతంలో పేరుకుపోవడం వల్ల నేరుగా గుండెపోటు వస్తుందని ఈ అధ్యయనం నిర్ధారించలేదు. మరో పరిమితి ఏంటంటే.. అధ్యయనంలో పాల్గొన్నవారంతా తెల్ల జాతికి చెందినవారు. ఇతర జాతులు లేదా భిన్నమైన జనాభాలో ఫలితాలు వేరుగా ఉండే అవకాశం ఉంటు ందని పరిశోధకులు పేర్కొన్నారు. అందువల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడు కోవడానికి శరీర బరువుతోపాటు నడుము చుట్టుకొలతను కూడా గమనించడం, సమ తుల్యమైన ఆహా రం తీసుకోవడం, ప్రాసెస్డ్ ఫుడ్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక చక్కెరను తగ్గిం చడం వంటి జీవనశైలి మార్పులు చేయడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు.

### మన శరీరంలో అసలు విటమిన్ బి12 ఏం చేస్తుంది
# దీంతో కలిగే లాభాలేమిటి



విటమిన్ బి12 శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలలో ఒకటి. ఇది విటమిన్ బి కాంప్లెక్స్‌లో భాగం. ప్రపంచవ్యాప్తంగా సాధారణంగా కనిపించే పోషకాహార లోపాల్లో విటమిన్ బి12 లోపం కూడా ఒకటిగా ఉంది. మన నరాలు, ఎర్ర రక్త కణాలు ఆరోగ్యంగా ఉండటానికి ఇది ఎంతో అవసరం. శరీర ంలోని అనేక ముఖ్యమైన విధుల్లో విటమిన్ బి12 కీలక పాత్ర పోషిస్తుండటంతో, దీని లోపం ఏర్పడితే వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. శరీరంలో శక్తి స్థాయిలను నిర్వహించడంలో విటమిన్ బి12 సహాయపడుతుంది. కార్బొహైడ్రేట్లను శరీరం ఉపయోగించుకోగలిగే గ్లూకోజ్‌గా మార్చే ప్రక్రియలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. విటమిన్ బి12 లోపం ఉన్నవారిలో తరచూ అలసట కనిపించడానికి ఇది కూడా ఒక కారణంగా పేర్కొంటారు. అయితే శక్తి కోసం ప్రాసెస్డ్ ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడటం కంటే, సహజ ఆహార వనరుల ద్వారా విటమిన్ బి12 పొందడం మంచిదని నిపుణులు సూచి స్తున్నారు. మానసిక ఆరోగ్యానికి కూడా విట మిన్ బి12 ఉపయోగకరంగా ఉంటుంది. విటమిన్ డి మాదిరిగానే ఇది కూడా డిప్రెషన్ నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొంటున్నారు. విటమిన్ బి12 లోపం ఉన్న ప్పుడు చిరాకు, అలసట, నిరాశ, ఆందోళన లేదా నర్వస్‌నెస్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**గుండె ఆరోగ్యానికి..**

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలోనూ విటమిన్ బి12 ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రక్తంలో హోమోసిస్టీన్ స్థాయిలు అధికంగా ఉండటం వల్ల గుండెపోటు, స్ట్రోక్ వంటి గుం డె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగు తుంది. విటమిన్ బి12 హోమోసిస్టీన్ స్థాయి లను తగ్గించడంలో సహాయపడు తుంది. తద్వారా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే కొలెస్ట్రాల్, రక్తపోటును నియం త్రించడంలో, ధమనుల్లో ప్లాక్ పేరు కుపో కుండా నిరోధించడంలో కూడా ఇది సహా యపడుతుంది. జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా విటమిన్ బి12 అవసరం. శరీరంలో జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి ఇది సహాయపడుతుంది. అలాగే మంచి జీర్ణాశయ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహించడం, హానికరమైన బ్యాక్టీరియాను తగ్గించడం ద్వారా జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మం, జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి కూడా విటమిన్ బి12 ఉపయో గపడుతుంది. కణాల పునరుత్పత్తిలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. చర్మంపై ఎర్రదనం, మచ్చలు, మొటిమలు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు, గోళ్లు సులభంగా విరిగిపోకుండా బలంగా ఉండేందుకు కూడా ఇది తోడ్పడుతుం ది. గర్భిణీలకు.. గర్భధారణ సమయంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటు ంది. శరీరంలోని డీఎన్ఏ తయారీలో ఇది అవసరమైన పోషకం. శిశువు ఎదుగుదల, అభివృద్ధిలో డీఎన్ఏ కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా ఫోలేట్‌తో కలిసి పనిచేయడం ద్వారా శిశువులో కొన్ని జన్యుపరమైన లోపాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడు తుంది. విటమిన్ బి12 ఎర్ర రక్త కణాల ఉత్ప త్తికి కూడా అవసరం. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా రక్త హీనతను నివారించడంలో ఇది సహాయ పడుతుంది. రక్తహీనత వల్ల బలహీనత, అల సట వంటి సమస్యలు కనిపిస్తాయి. అం దువల్ల శరీరానికి తగినంత బి12 అందడం రక్తహీనత ప్రమాదాన్ని తగ్గించడంలో ముఖ్యమైందిగా పేర్కొంటున్నారు.

**క్యాన్సర్లను తగ్గించేందుకు..**

కొన్ని అధ్యయనాల ప్రకారం ఫోలేట్‌తో కలిపి విటమిన్ బి12 సప్లిమెంట్లను తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ప్రోస్టేట్, పెద్దపేగు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల విషయంలో దీని ప్రయోజనాలపై అధ్యయ నాలు ఉన్నట్లు తెలిపారు. అయితే దీనిని క్యాన్సర్‌కు నిర్ధారిత నివారణగా పరిగణి ంచకూడదు. మెదడు, జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం వంటి కాగ్నిటివ్ ఫంక్షన్లను మెరుగ్గా ఉంచడంలో విటమిన్ బి12 పాత్ర ఉంటుంది. దీని లోపం అల్జీమర్స్, డిమెన్షియా వంటి నాడీ సంబంధిత క్షీణత సమస్యలతో సంబ ంధం కలిగి ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ ఇటువంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించ డంలో తగినంత బి12 తీసుకోవడం సహాయపడుతుంది.

**నిద్రలేమి సమస్య ఉంటే..**

నిద్ర విధానాన్ని క్రమబద్ధీకరించడంలోనూ విటమిన్ బి12 పాత్ర ఉంటుంది. శరీరంలో నిద్రకు సంబంధించిన హార్మోన్ మెలటోనిన్ ఉత్పత్తిలో ఇది సహాయపడుతుంది. విటమిన్ బి12 లోపం నిద్రలేమితో సంబంధం కలిగి ఉంటుంది. నిద్ర-మేల్కొనే సమయాల చక్రం లో సమస్యలు ఉన్నవారిలో బి12ను ఉప యోగించే సందర్భాలు ఉంటాయి. నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి విటమిన్ బి12 అత్యంత ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. సయనోకోబాలమిన్ అని కూడా పిలిచే విటమిన్ బి12, కేంద్ర నాడీ వ్యవస్థలో ముఖ్య మైన భాగమైన మైలిన్ ఏర్పాటుకు అవసరం. మైలిన్ తయారీ సక్రమంగా జరగకపోతే నాడీ సంబంధిత నష్టం కలిగే అవకాశం ఉంటుంది. తల్లుల్లో విటమిన్ బి12 లోపం ఉంటే పాలిచ్చే శిశువులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తీవ్రమైన లోపం ఉన్న సందర్భాల్లో శిశువుల్లో కొన్ని నాడీ సంబంధిత సమస్యలు, మెదడు అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, చూపు సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే విటమిన్ బి12 లోపంతో కూడిన కొన్ని రకాల రక్తహీనత ఉన్నవారిలో జ్ఞాప కశక్తి, కాగ్నిటివ్ ఫంక్షన్ తగ్గడం, డిమెన్షియా వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది. లోపం ఉంటే.. విటమిన్ బి12ను శరీరం సరి గా గ్రహించలేకపోవడం వల్ల కూడా లోపం ఏర్పడుతుంది. స్వల్ప స్థాయి లోపం కూడా రక్తహీనత, అలసట, నిరాశ వంటి లక్షణాలకు దారితీస్తుంది. శక్తి స్థాయిలు, జీర్ణక్రియ, చర్మం, జుట్టు వంటి అనేక అంశాలపై ప్రభా వం చూపే ముఖ్యమైన విటమిన్‌గా బి12ను వైద్యులు పేర్కొం టున్నారు. రోజుకు సుమారు 3 మైక్రోగ్రాము ల విటమిన్ బి12 శరీరానికి అవసరమవుతుందని చెబుతున్నారు. సముద్ర ఆహారాల్లో విటమిన్ బి12 అధికంగా లభిస్తుంది. లాబ్ స్టర్, గుల్లలు, పీతలు, రొయ్యలు, మస్సెల్స్ వంటి వాటితోపాటు సాల్మన్, మాకెరెల్, హెర్రింగ్, సార్డిన్స్, ట్రౌట్ వంటి చేపల్లో కూడా బి12 సమృద్ధిగా ఉంటుంది. ఫోలిక్ యాసిడ్ కూడా బి విటమిన్ల సమూహంలో ముఖ్యమైన పోషకం. ఫోలిక్ యాసిడ్ లోపం పెద్దల్లో రక్తహీనత, నాడీ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. గర్భధారణ సమ యంలో లోపం ఉంటే శిశు వుల్లో న్యూరల్ ట్యూబ్ లోపాల ప్రమాదం పెరుగుతుంది. తగినంత పోషకాలు అందని కారణంగా జనాభాలో కొంతమందిలో ఫోలిక్ యాసిడ్ లోపం కనిపిస్తుంది. గర్భిణీలకు విటమిన్ బి12 అవసరం కూడా ఎక్కువగా ఉంటుంది. విటమిన్ బి12 లోపాన్ని నివా రించడానికి సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసు కోవడం ముఖ్యం. అల సట, చిరాకు, నిరాశ, బలహీనత వంటి లక్ష ణాలు నిరంతరం కనిపిస్తే స్వయంగా సప్లి మెంట్లను తీసు కోవడం కంటే వైద్య నిపు ణులను సంప్రదించి అవసరమైతే రక్త పరీక్ష లు చేయిం చుకోవడం మంచిది.

# అరటి దోశ తయారీ విధానం



**అరటి దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు**

మైదా పిండి: ఒక కప్పు, అరటిపండ్లు: రెండు, పసుపు: అర టీస్పూన్, చక్కెర: అర కప్పు, పాలు: పావు కప్పు, నూనె: కొద్దిగా.

**అరటి దోశ తయారీ విధానం**

మిక్సీ జార్‌లో అరటిపండ్లు, మైదా, పసుపు, పాలు, చక్కెర వేసి మెత్తగా గ్రైండ్ చెయ్యాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి వేడయ్యాక ఒక టీస్పూన్ నూనె వెయ్యాలి. అప్పటికే సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని గరిటెతో వేసి దోశలా పరవాలి. రెండు వైపులా నూనెవేస్తూ సన్నని మంటపై కాలిస్తే నోరూరించే అరటి దోశ సిద్ధం.

# సెల్లు సిత్రం

ఇంటి ముంగట మంది బగ్గనే జమైంద్రు. "అయ్యో మల్లేషా మా ఇంటికన్న ఒచ్చి ఒక ముచ్చటైన జెప్పకపాయే! ఎంత పని జేసిండు. ఇప్పుడు వాని పెండ్లాం పిల్లలు ఆగమైద్రు!" అని కొంగు మూతికాడవెట్టి, ఒక్క తీర్గ దుఃఖం ఎల్లవోస్తున్నది రామక్క.మల్లేష్ పెండ్లాం పద్మ సుట్టూర కూసోని వాడకట్టోళ్లంత గూడి శోకా లు వెడుతాద్రు. "ఔనే పద్దీ! ఏమైందే.. పగటీలి ఏ సప్పుడు లేకుండే మంచిగనే ఉంటిరి గదనే రాత్రి ఏమనుకున్నరే.. పానం తీస్కునే ంత కట్టమేమచ్చిందే.. శెప్పవేమే" అని అడుగు తున్నది రామక్క.ఆమె ప్రశ్నలకు జవాబిస్త లేదు. లోపటున్నది బైటవెడ్తలేదు. అండ్లద ండ్లనే కుమిలి గోడకు ఒరిగి.. మొగన్ని, అత్త ను దీనంగ సూత్తున్నది పద్మ. "ఓ తమ్మీ.. నా తమ్మీ నువ్వెంత పని జేస్తివిరా.. నా అయ్యా అనీ గట్టిగ ఒర్లుత.. రొండు శేతులు చాతి మీద గుద్దుకుంట.. మల్లిగాని మీదొచ్చి పడ్డడు పెద్దబాపు కొడుకు సాయన్న. అది జూంసన తన భార్య ఒక్కసారిగా దీర్ఘం తీసింది. ఆడు న్నోళ్లకు దుఃఖం ఆగుతలేదు. అందరు ఏడుపు మొదలువెట్టిద్రు. జెరాగి సాయన్న లేసి.. "ఓరి పోడా రాజు ఇంటెన్క గడ్డాములకెల్లి మోపెడం త గడ్డి తేపో కాకను కిందేసిద్రు. గాయింత సోయి లేదారా అనే.. ఆ పోరడు పోయి మోపెడంత ఎందుకని సందెడంత గడ్డి పట్క చ్చిండు. ఇంట్లకెల్లి పీటె తెచ్చి, దాని మీద గడ్డే సి పండేశిద్రు. తలాపున గాంచునూనె దీపం, ఆగరుబత్తీలు. నొష్టికి ఇంత కుంక్మ, ఒక రూపాయి సిక్కతో.. శెవాన్ని సింగారిచ్చి ఆకిట్ల ఒక బాదుకు అగ్గి రాజేసిద్రు.. "రాజు.. గా శివన్నకు ఫోన్ జేసి టెంటు, కుర్చీలు తీస్క రాపో అనే సాయన్న.నిమిషాల్ల తెచ్చి ఏశిద్రు. పెద్ద మనుషులు కూసున్నరు. దోస్తులకు ముచ్చట తెల్సి వస్తున్నరు. ఆడునోళ్లకు వాళ్ల గోస సూడ వశమైతలేదు.

## తలనొప్పిగా ఉన్నప్పుడు టీ లేదా కాఫీ తాగడం మంచిదేనా

ప్రస్తుత కాలంలో తలనొప్పి చాలా సాధారణ సమస్యగా మారింది. ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం, శరీరంలో నీరు తగ్గడం, మొబైల్ లేదా కంప్యూటర్‌ను ఎక్కువసేపు చూడటం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వంటి అనేక కారణాల వల్ల తలనొప్పి రావచ్చు. ఇలాంటి సమయంలో చాలామంది వెంటనే ఒక కప్పు టీ లేదా కాఫీ తాగుతుంటారు. అయితే అది నిజంగా తలనొప్పిని తగ్గిస్తుందా ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో తెలుసు కుందాం..ఆరోగ్య నిపుణుల ప్రకారం.. టీ, కాఫీలో ఉండే కెఫిన్ కొందరిలో తలనొప్పి లేదా మైగ్రేన్ నుంచి తాత్కాలికంగా ఉపశ మనం కలిగించవచ్చు. అందుకే కొన్ని తల నొప్పి నివారణ మందుల్లో కూడా కెఫిన్‌ను ఉపయోగిస్తారు. అయితే కెఫిన్ ప్రభావం ప్రతి ఒక్కరిలో ఒకేలా ఉండదు. మితంగా తీసు కుంటే కొందరికి నొప్పి తగ్గవచ్చు. కానీ రోజూ ఎక్కువ మోతాదులో కెఫిన్ తీసుకునే వారిలో తలనొప్పి వచ్చే అవకాశం కూడా ఉంటుంది.అలాగే, రోజూ టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉన్నవారు ఒక్కసారిగా కెఫిన్ తీసు కోవడం పూర్తిగా ఆపేస్తే కూడా తలనొప్పి రావచ్చు.

దీనిని కెఫిన్ ఉపసంహరణ వల్ల వచ్చే తలనొప్పిగా చెబుతారు. కెఫిన్ తీసు కున్న తర్వాత మీ తలనొప్పి మరింత పెరుగు తున్నట్లు అనిపిస్తే, దాని పరిమాణాన్ని తగ్గిం చడం మంచిది. సమస్య తరచూ వస్తుంటే వైద్యులను సంప్రదించాలి.

సోమవారం,
ఆగస్టు 10, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# వాడని బ్యాంకు ఖాతాలతో

## సిబిల్ స్కోర్ తగ్గుతుందా

ఈ రోజుల్లో చాలా మందికి చాలా బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. అయితే వీటిలో అన్నింటినీ వినియోగించని వారుంటారు. వాటి పై దృష్టి పడినప్పుడు వాడని బ్యాంకు ల ఖాతాలు, క్రెడిట్ కార్డులు ఎందుకు మూసివేస్తే అయిపోతుంది కదా అని అనుకుంటారు. ఒకవేళ అలా మూసివేస్తే సిబిల్ స్కోర్ ఏమైనా దెబ్బతింటుందా అన్న అనుమానం వస్తుంది. సిబిల్ స్కోర్ అనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. తిరిగి చెల్లించే అలవాటు, క్రెడిట్ వినియోగం, ఎక్కువ గా రుణ విచారణలు, సుదీర్ఘ క్రెడిట్ చరిత్ర వంటివి ఇందులో ఉంటాయి. అయితే పాత క్రెడిట్ కార్డు లేదా బ్యాంకు ఖాతాను క్లోజ్ చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడవచ్చని, అయితే ఇది మీ మొత్తం క్రెడిట్ ప్రొఫైల్‌పై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.




**బ్యాంకు ఖాతాల విషయానికివస్తే..**

సేవింగ్స్ లేదా కరెంట్ బ్యాంకు ఖాతాలున్న వారు వాటిలో ఒక దాన్ని మూసివేస్తే దాని వల్ల వారి సిబిల్ స్కోర్‌పై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండదు. ఎందుకంటే డిపాజిట్ ఖాతాల వివరాలను క్రెడిట్ బ్యూరోలకు రిపోర్ట్ చేయకపోవడమే కారణం. అంటే బ్యాంకు ఖాతాలు మీ క్రెడిట్ రిపోర్ట్‌లో భాగం కాదన్న మాట. అయితే మీరు క్లోజ్ చేసే ఖాతా ఒక వేళ మీరు చెల్లించాల్సి ఉన్న రుణ ఈఎంఐలు లేదా క్రెడిట్ కార్డు చెల్లింపుల కోసం లింక్ చేసి ఆటో డెబిట్ ఆదేశాలు ఇచ్చి ఉంటే మాత్రం పరోక్షంగా సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడవచ్చు. సదరు ఖాతాను మూసివేసే ముందు మీరు గనక ఆ ఆదేశాలను అప్‌డేట్ చేయకపోయినట్లయితే చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉంటుంది. అప్పుడు చెల్లింపులు మిస్సయినట్టు క్రెడిట్ బ్యూరోలు రిపోర్ట్ చేయవచ్చు. ఇది మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను దెబ్బ తీయవచ్చు. అందుకే ఒక ఖాతాను మూసివేసే ముందు దానితో అనుసంధానం చేసిన ఆటో డెబిట్ మాండేట్‌లను ఒకసారి చూసుకోండి. అలాంటివి ఏమైనా ఉండే వాటిని మీరు ఎక్కువగా వాడుతున్న ఖాతాకు మార్చుకోండి.

**క్రెడిట్ కార్డు క్లోజ్ చేస్తున్నారా..**

ఇక్కడ ఒక విషయం ఏమిటంటే.. మీకున్న క్రెడిట్ కార్డుల్లో ఒకదాన్ని క్లోజ్ చేస్తే మీకు అందుబాటులో ఉండే క్రెడిట్ తగ్గిపోతుందన్న విషయాన్ని గమనించాలి. ఉదాహరణకు మీ దగ్గరున్న క్రెడిట్ కార్డుల మొత్తం క్రెడిట్ పరిమితి రూ.5 లక్షలు అనుకుంటే అందులో మీరు వినియోగించుకునే మొత్తం రూ.లక్ష అయితే మీ క్రెడిట్ వినియోగం 20 శాతం అన్నట్టు. ఒకవేళ మీరు రూ.లక్ష పరిమితి ఉన్న కార్డును మూసివేస్తే మీకు అందుబాటులో క్రెడిట్ రూ.4 లక్షలకు తగ్గిపోయి మీ క్రెడిట్ వినియోగం 25 శాతానికి పెరుగుతుంది. ఇక చాలా కాలంగా ఉంటున్న కార్డును మూసివేయడం వల్ల సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ వల్ల కలిగే ప్రయోజనం కూడా తగ్గవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు..**

సిబిల్ స్కోర్‌ను ప్రభావితం చేసే వాటిలో తిరిగి చెల్లింపు ప్రవర్తన, వివిధ రుణ ఖాతాలు, ఇటీవలి రుణ విచారణలతో పాటు సుదీర్ఘ క్రెడిట్ చరిత్ర అనేది మీ స్కోర్‌ను ప్రభావితం చేసే కీలకమైన అంశాల్లో ఒకటి. సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ.. కాలక్రమేణా మీరు క్రెడిట్‌ను ఎలా నిర్వహించారనే దానిపై రుణ దాతలకు ఒక స్పష్టతను ఇస్తుంది. అలాగే మీరు తిరిగి చెల్లించే విషయంలో అనుసరించే క్రమశిక్షణను అంచ నా చేయడాన్ని సులభతరం చేస్తుంది. అందుకే మీరు బాగా నిర్వహించిన క్రెడిట్ ఖాతా మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుంది. ఒకవేళ మీ పాత క్రెడిట్ కార్డును క్లోజ్ చేస్తే మీ క్రెడిట్ హిస్టరీ తగ్గిపోవచ్చు. అప్పుడు మీ స్కోర్‌పైనా ప్రభావం పడవచ్చు. అందుకే అలాంటి కార్డుపై వార్షిక ఫీజు లేనట్టయితే అప్పుడప్పుడూ వాడు తూ యాక్టివ్‌గా ఉంచుకోవడం మేలు. ఎందుకంటే ఇది మీ క్రెడిట్ హిస్టరీని కాపాడటంతో పాటు దీర్ఘకాలంలో బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌కూ తోడ్పడుతుంది. మీకు ఎన్ని క్రెడిట్ కార్డులు ఉన్నాయనేది కాకుం డా సకాలంలో తిరిగి చెల్లించడం, క్రమశిక్షణతో కూడిన వినియోగం, పాత క్రెడిట్ కార్డుల నిర్వహణ వంటివి మీ క్రెడిట్ ప్రొఫైల్‌పై అధిక ప్రభావం చూపుతాయి. అందుకే మీరు ఎన్ని క్రెడిట్ కార్డులను నిర్వహించగలుగుతారనే అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. తమ క్రెడిట్ హిస్టరీపై పడే ప్రభావాన్ని పరిశీలించకుండానే కొందరు చాలా ఏళ్లుగా వాడుతున్న తమ పాత క్రెడిట్ కార్డును క్లోజ్ చేస్తుంటారు.

కానీ ఇలాంటి పొరపాటు చేయకపోవడం మంచిది. సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ అనేది క్రెడిట్ ప్రొఫైల్‌లో ముఖ్యమైన అంశంగా గుర్తుంచుకోవాలి. ఇక ఏదైనా క్రెడిట్ కార్డు మూసివేసే ముందు మీరు చెల్లించాల్సిన మొత్తం బకాయిలను చెల్లించండి. అలాగే ఆ కార్డు మీ క్రెడిట్ హిస్టరీకి ఎంతగా దోహదపడుతుందో ఒక్కసారి చూసుకోండి.

## నాలుగు రోజుల పాటు బంగారం ధరల్లో

## పెరుగుదల ప్రస్తుతం రేట్స్ ఇవీ




గత నాలుగు రోజులుగా భారత్‌లో బంగారం ధరలు వరుసపెట్టి పెరిగాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం తగ్గుతున్న సంకేతాల నడుమ మళ్లీ బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. ఆగస్టు 5న దేశంలో రూ.1, 44,000గా ఉన్న 24 క్యారెట్ల పసిడి ధర నాలుగు రోజుల్లో రూ. 8 వేల పైచిలుకు మేర పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు (ఆగస్టు 9) ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,350గా ఉంది.

ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,39,650 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల పసిడి ధర రూ.1,14,260 వద్ద ట్రేడవుతోంది.

# నయా ఫండ్స్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్ ను ప్రారంబి.ంచింది. ఇది మార్కెట్ క్యాపిటలైజేషన్స్ ఆధారంగా ఈక్విటీ ఆధారిత, ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆఫ్ ఫండ్. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ. 1, 0 00. సిప్ అయితే రూ.500. ముగింపు తేదీ ఈ నెల 19.

**కోటక్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్**

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్.. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 17. కనీస పెట్టుబడి రూ.1,000.

**బంధన్ కాంట్రా ఫండ్**

బంధన్ మ్యూచువల్ ఫండ్.. కాంట్రా ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించటంతో పాటు ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్న రంగాలను ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ నెల 10న ప్రారంభం కానున్న ఈ ఫండ్ ముగింపు తేదీ 24.

**ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ షార్ట్ టర్మ్ ఫండ్**

ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ (ఇండియా).. షార్ట్ టర్మ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ షార్ట్ టర్మ్ డెట్ పథకం. ఏడాది నుంచి మూడేళ్ల కాలవ్యవధి కలిగిన అత్యుత్తమ కార్పొరేట్ డెట్ సెక్యూరిటీస్, ప్రభుత్వ సెక్యూరిటీలు, రాష్ట్ర అభివృద్ధి రుణాలు (ఎస్‌డీఎల్ఎస్) సహా మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ ఈ నెల 13.

# ఈ-వే బిల్లులో కొత్త మార్పు

జీఎస్‌టీ చట్టం ప్రకారం నిర్ణీత విలువకు మించి వస్తువులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే సందర్భాల్లో ఈ-వే బిల్ తీసుకోవాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. సాధారణంగా వస్తువులను ఎవరు కొనుగోలు చేస్తారో.. వారికే సరుకు పంపటం జరుగుతుంది. అయితే వ్యాపార లావాదేవీల్లో బిల్లు ఒకరి పేరుతో ఉండి.. సరుకు మాత్రం మరొకరికి పంపే సందర్భాలు చాలానే ఉంటాయి. ముఖ్యంగా డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పెద్ద కంపెనీలు, ఆన్‌లైన్ వ్యాపారాల్లో ఇటువంటి లావాదేవీలు సాధారణంగా జరుగుతుంటాయి. ఇలాంటి లావాదేవీల్లో సరుకు వాస్తవంగా ఎవరికి చేరుతుందో మరింత స్పష్టంగా తెలుసుకోవటానికి జీఎస్‌టీ నెట్‌వర్క్ ఈ-వే బిల్ విధానంలో కొత్త మార్పు తీసుకువచ్చింది. దీని ప్రకారం బిల్ టు/షి?ప-టు లావాదేవీల్లో సరుకు అంతిమంగా అందుకునే వ్యక్తికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉంటే.. అతని రిజిస్ట్రేషన్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ సరుకు అందుకునే వ్యక్తికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేకుంటే యూఆర్‌పీ.. అంటే అన్‌రిజిస్టర్డ్ పర్సన్ అని నమోదు చేయవచ్చు. ఈ ఆగస్టు 1 నుంచి




అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధన గురించి వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలి.

బిల్-టు/షిప్-టు అంటే: దీన్ని ఒక ఉదాహరణతో సులభంగా అర్థం చేసుకోవ చ్చు. ఏలూరులో ఉండే అనంత్ అనే వ్యాపారి తనకు కావాల్సిన సరుకును ఎప్పుడు రాజమండ్రిలోని రమేశ్ అనే వ్యాపారి వద్ద కొనుగోలు చేస్తున్నాడు. అలాగే ఈ సారి కూడా తనకు కావాల్సిన వస్తువుల లిస్ట్‌ను రమేశ్‌కు పంపాడు. అయితే తన దగ్గర సమయానికి ఆ వస్తువులు అందుబాటులో లేకపోవటంతో రమేశ్, విజయవాడలోని శ్రీనివాస్ అనే మరో వ్యాపారస్తునికి ఈ ఆర్డర్ మొత్తం పంపాడు. అలాగే సరుకు రాజమండి వచ్చి తిరిగి ఏలూరు పోవటం అంటే సమయం వృథా, రవాణా ఖర్చులు అధికం కూడా. కాబట్టి శ్రీనివ్షసతో ఆ సరుకును నేరుగా అనంత్‌కు పంపమని సూచించటం జరిగింది. వ్యాపార లావాదేవీల్లో ఇలా సరుకు పంపించటం చాలా సాధారణం. ఇక్కడి ఎవరికి ఎవరు కస్టమర్ అని ఆలోచిస్తే రమేశ్‌కు అనంత్ కస్టమర్ కాగా.. శ్రీనివ్షసకు రమేశ్ కస్టమర్. అంటే శ్రీనివాస్ ఇన్వాయిసను రమేశ్‌కు ఇస్తాడు. రమేశ్ తన ఇన్వాయిసను అనంత్‌కు ఇస్తాడు. కానీ సరుకు మాత్రం శ్రీనివాస్ నుంచి నేరుగా అనంత్‌కు చేరుతుంది. దీన్నే బిల్ టు/షిప్ టు విధానం అంటారు. అంటే బిల్ (ఇన్వాయిస్) ఒకరి పేరుతో ఉంటే, షిప్పింగ్ అంటే డెలివరీ వేరే వ్యక్తి పేరుతో ఉంటుంది.

అయితే ఈ విధానం ఈ-వే బిల్ వ్యవస్థలో ఎప్పటి నుంచో ఉంది. కాకుంటే సరుకు వాస్తవంగా అందుకుంటున్న వ్యక్తి అంటే అనంత్‌కు సంబంధించిన జీఎస్‌టీ నంబర్ ఇప్పటి దాకా వేయటం అనేది తప్పనిసరి కాదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన నిబంధన ప్రకారం.. శ్రీనివాస్ అనే వ్యక్తి సరుకును రమేశ్ పేరు మీద పంపుతున్నప్పటికీ అది అంతిమంగా చేరేది.

అనంత్‌కు కాబట్టి రమేశ్ జీఎస్‌టీ వివరాలతో పాటు అనంత్ జీఎస్‌టీ వివరాలు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలి. ఒకవేళ అనంత్‌కు రిజిస్ట్రేషన్ లేకుంటే 'యూఆర్‌పీ' (అన్ రిజిస్టర్డ్ పర్సన్) అని నమోదు చేయవచ్చు.

## పన్నుల కోసమే భారత్‌లో బ్రిటిషర్లు 4000

## కిలోమీటర్లు గోడ కట్టారని తెలుసా

: భారత స్వాంతంత్ర్య దినోత్సవం వేళ బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీకి సంబంధించిన ఒక విచిత్రమైన, విస్తుపోయే చారిత్రక ఘట్టాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు ఆ తర్వాత దేశాన్ని ఆక్రమించి దాదాపు 200 ఏళ్లు మనల్ని బానిసలుగా చేసుకున్నారు. ఎన్నో రకాల పన్నులు వేసి పీడించారు. విలువైన సంపదను తరలించారు. ఈ క్రమంలోనే పన్నుల వసూలు కోసం ఏకంగా 400 కిలోమీటర్ల పొడవైన గోడను నిర్మించారు. ఈ విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. అయితే, ఇది నిజమే. భారతదేశంలో సామాన్యుడు తినే ఉప్పుపై కూడా భారీగా పన్ను వసూలు చేసేందుకు, స్మగ్లింగ్‌ను అడ్డుకోవడానికి బ్రిటీష్ పాలకులు 4000 కిలోమీటర్లు చెట్లు, పొదలతో కూడిన భారీ జీవ గోడను ను నిర్మించారు.

1995లో లండన్‌కు చెందిన ప్రముఖ పుస్తక సంరక్షకుడైన రాయ్ మోక్స్ హామ్, ఒక బ్రిటీష్ అధికారి రాసిన తన జీవిత చరిత్రలో భారతదేశం అంతటా ఒకప్పుడు విస్తరించి ఉన్న భారీ కంటే గురించిన ప్రస్తావనను చూశారు. ఉప్పుపై పన్నును అమలు చేసేందుకు బ్రిటిష్ అధికారులు వేల కిలోమీటర్ల పొడవునా ఒక జీవ అడ్డుగోడను ( నిర్మించి, నిర్వహించేవారని తెలుసుకున్నారు. దీనిపై ఆసక్తి పెంచుకున్న మోక్స్ హామ్, దాని చరిత్రను పునర్నిర్మించేందుకు ఏళ్ల తరబడి పాత రికార్డులను పరిశీలిస్తూ, భారతదేశమంతటా పర్యటించారు. కల్వర్టులో బోల్తాపడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. 18 మందికి తీవ్ర గాయాలు ప్రియాంక మృతి కలచివేస్తోంది.. కఠిన శిక్షలు పడేలా చూస్తాం: చంద్రబాబు హైదరాబాద్‌లో బోనాల వేళ.. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ.. భక్తురాలి వెండి బిస్కెట్లు, డబ్బు మాయం

ఆ తర్వాత 2001లో 'ది గ్రేట్ హెడ్జ్ ఆఫ్ ఇండియా: ది సెర్చ్ ఫర్ ద లివింగ్ బారియర్ దట్ డివైడెడ్ ఏ పీపుల్' అనే పుస్తకాన్ని రాశారు. బ్రిటిష్ పాలనలో పన్నుల వసూలు కోసం చేపట్టిన అత్యంత భారీ, విలక్షణమైన ప్రాజెక్టులలో ఒకదానిని ఈ పుస్తకం తిరిగి ప్రజల దృష్టికి తీసుకువచ్చింది.

భారత్‌లో గొప్ప గోడను సృష్టించిన ట్యాక్స్

బ్రిటిష్ పాలనలో భారత్‌లో అత్యధిక పన్ను విధించిన వస్తువులలో ఉప్పు ఒకటి. విలాసవంతమైన వస్తువుల మాదిరిగా కాకుండా, ఉప్పును ప్రతి ఒక్కరూ వినియోగించేవారు. జీవించేందుకు ధనిక, పేద అనే తేడా లేకుండా అందరికీ ఇది అవసరం. అందుకే ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఒక వనరుగా మారింది. బ్రిటిష్ పాలిత ప్రాంతాలలో ఏర్పడిన అసమాన పన్ను విధానంలోనే ఈ సమస్యకు మూలాలు ఉన్నాయి.

రైల్లో ప్రయాణించిన రాష్ట్రపతి.. "ప్రెసిడెంట్ రైలు" చరిత్ర గురించి తెలుసా

కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే ఉప్పుపై, ఇతర చోట్ల లభించే ఉప్పుతో పోలిస్తే చాలా ఎక్కువ పన్నులు విధించేవారు. దీనివల్ల అక్రమ రవాణాకు బలమైన ప్రోత్సాహం లభించింది. వ్యాపారులు ఒక ప్రాంతంలో తక్కువ ధరకు ఉప్పును కొనుగోలు చేసి, పన్నుల కారణంగా ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దానిని స్మగ్లింగ్ చేసేవారు. ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, ఈస్ట్ ఇండియా కంపెనీ 19వ శతాబ్దం ప్రారంభంలో కస్టమ్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడం మొదలు పెట్టింది.

# భారత ఐటీ ఉద్యోగులకు శుభవార్త లేఆఫ్స్ కంటే కొత్త

## ఉద్యోగాలే ఎక్కువ కీలక రిపోర్ట్

రిటైర్మెంట్ సమయంలో లేదా అత్యవసర సమయంలో పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేయాలంటే నిధులు ఒకచోట ఉంటే తీసుకోవడం ఈజీ. వివిధ ఖాతాల నుంచి విత్ డ్రా చేయాల్సిన అవసరం తప్పుతుంది. అలాగే పీఎఫ్ సొమ్ముపై లభించే వార్షిక వడ్డీ అసలులో కలిసి చక్రవడ్డీ రూపంలో పెరుగుతుంది. నిధులన్నీ ఒకే ఖాతాలో ఉంటే రిటైర్మెంట్ నాటికి భారీ నిధి సమకూరుతుంది. ఈపీఎఫ్ రూలం ప్రకారం కనీసం 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటేనే రిటైర్మెంట్ తర్వాత నెల నెలా పెన్షన్ పొందే అర్హత లభిస్తుంది. సర్వీస్ హిస్టరీ క్రమం తప్పకుండా విలీనమైతేనే ఈ 10 ఏళ్ల వ్యవధి పూర్తవుతుంది.

**ఖాతాలను ఎలా మెర్జ్ చేయాలి?**

ఈపీఎఫ్ఓ మెంబర్ సేవా పోర్టల్ ఓపెన్ చేసి యూఏఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి.




మెనూలోని ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలోకి వెళ్లి వన్ మెంబర్- వన్ ఈపీఎఫ్ అకౌంట్ ఆప్షన్ ఎంచుకోవాలిఅక్కడ మీ వ్యక్తిగత వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిని ధ్రువీకరించాలి.పాత అకౌంట్లన్నీ ఒకే చోట చేర్చేందుకు యూఏఎన్ ఐడీ ఎంటర్ చేయాలి.మీ మొబైల్ నంబర్‌కు వచ్చే వన్ టైమ్ పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే వెరిఫికేషన్‌కు వెళ్తుంది.మీ నుంచి వెళ్లిన రిక్వెస్ట్ ప్రస్తుత ఎంప్లాయర్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆమోదం పొందిన తర్వాత ఈపీఎఫ్ఓ మీ రిక్వెస్ట్‌ను ప్రాసెస్ చేస్తుంది. ఒకసారి ఈ ప్రక్రి య అంతా పూర్తయ్యాక పాత అకౌంట్లలోని నగదు ఒకే ఖాతాలో కనిపిస్తుంది.

# యూత్ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా,**
భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతున్న సంస్థ యూత్ కాంగ్రెస్ అని




అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువతకు సమాన అవకాశాల కోసం యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువత ఐక్యంగా ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో క్రియాశీల భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి యువ కాంగ్రెస్ కార్యకర్తకు ఎమ్మెల్యే గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

- కార్డియాలజీ న్యూరో నెఫ్రాలజీ సేవలు
- వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న సింగరేణి కుటుంబ సభ్యులు



**భద్రాద్రి కొత్తగూడెం**
సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశాలతో, సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల కొరకు ఆదివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేసి పలు విభాగాలలో సేవలందించారు. హైదరాబాద్ సింధు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు సేవలు అందించారు.ఈ సందర్భంగా సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల ఉద్యోగుల సంక్షేమం విషయములో ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ రెండవ ఆదివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను నిర్వహించుకుంటున్నామని ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మొత్తం 159 మంది రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.
అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులో హెల్త్ ఆఫీసర్ డి.లలిత, మెయిన్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

- భాష సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి
- ఆదివాసీ యువత విద్య ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ





**భద్రాద్రి కొత్తగూడెం**
కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవాన్ని భాష సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం తోపాటు ఆదివాసీ యువత విద్య ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ(సీతక్క) అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి దానసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్సులతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవం స్వేచ్ఛ సమానత్వం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు. కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మ చేసిన పోరాటం నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాల వరకు ఆదివాసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు.
అడవిపై హక్కులు భూమిపై హక్కులు విద్య ఉపాధి గృహాలు తదితర ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
ఆదివాసీ ప్రాంతాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరి వినతిని ఓపికగా విని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.
స్కిల్ డెవలప్‌మెంట్ గిరిజన సంక్షేమం పంచాయతీరాజ్ రోడ్లు-భవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.కొమరం భీమ్ "జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాటం చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్లు నిధులు నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఆదివాసీల భాష సంస్కృతి సంప్రదాయాలు పండుగలు గోత్రాలు జీవన విధానమే వారి అస్థిత్వమని మంత్రి సీతక్క అన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా తమ మూలాలను మాతృభాషను సంస్కృతిని సంప్రదాయాలను మరచిపోకూడదని సూచించారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.


**ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి...**
ఆదివాసీ సమాజంలో ఐక్యత చైతన్యం విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం గిరిజన విద్యా వికాశం భవనం ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.
ఆదివాసీ సంక్షేమం పరిరక్షణకు ప్రాధాన్యత..
జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.కొమరం భీమ్ రాంజీ గోండు సమ్మక్క-సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష సంస్కృతి సంప్రదాయాలు వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య వైద్యం మౌలిక వసతులు ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ హక్కులు బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిటి నాయుడు సేవలు చిరస్మరణీయం



**భద్రాద్రి కొత్తగూడెం**
సింగరేణి ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, సీనియర్ దళిత నాయకులు పిటి నాయుడు ఆకస్మిక మరణం ఎంతో బాధాకమని ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. పిటి నాయుడు మృతదేహాన్ని మద్దెల శివకుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ పిటి నాయుడు సింగరేణి కాలరీస్ లో పనిచేయడం జరిగిందన్నారు. తెలంగాణ తొలి మలి దశల ఉద్యమాలలో కూడా పిటి నాయుడు క్రియాశీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ నివాళి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటుమాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెబి శౌరి, ఐఎన్టీయూసీ సింగరేణి ఏరియా సెక్రెటరీ రజాక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి పాల్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, పెయింటర్ ప్రకాష్, సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఏ రజాక్, సీనియర్ సిపిఐ నాయకులు మాతంగి లింగయ్య, దళిత సంఘాల జిల్లా నాయకులు సుబ్బారపు మధుసూదన్ చిన్ని, కూర రవీందర్, బీరమోహనరావు, భూపతి అశోక్, మచ్చ పృథ్వీరాజ్, కనుకుంట్ల బాబన్న, కండక్టర్ ప్రసాద్, మెకానిక్ వెంకట్, రాము, రాజేశ్వరరావు, సాయి కుమార్, శ్యామ్, సి ఎస్ ఐ చర్చి పాస్టర్లు, కమిటీ సభ్యులు, స్త్రీల కూటమి సభ్యులు, దేవుని బిడ్డలు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# రాత్రి పడుకునే ముందు ఇవి తింటే ఆరోగ్యానికి హానికరం



మంచి ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం. కానీ నేటి జీవితంలో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. మనం తినే ఆహారం కూడా నిద్రపై ప్రభావం చూపుతుంది. నిద్రలేమీతో క్రమక్రమంగా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. అందుకే రాత్రి పూట కొన్ని ఆహారాలను తీసుకోవడం మానుకుంటే కంటినిండా నిద్రపోవచ్చు. మరి రాత్రి పడుకునే ముందు తినకూడని ఆ ఆహార పదార్థాలేవో ఇప్పుడు తెలుసుకుందాం..

**కెఫీన్ ఉన్నవి**
కాఫీ, టీ, ఎనర్జీ డ్రింక్స్, చాక్లెట్లు వంటి వాటలో కెఫీన్ ఉంటుంది. ఇవి మెదడును చురుకుగా ఉంచి నిద్ర పట్టకుండా చేస్తాయి. కాబట్టి రాత్రి పడుకునే ముందు వీటికి దూరంగా ఉండటం మంచిది.

**మసాలాలు, వేపుళ్లు**
మసాలాలు, వేయించిన ఆహారం తింటే కడుపులో మంట, ఎసిడిటీ కలుగుతుంది. దాంతో నిద్రకు ఇబ్బంది కలుగుతుంది. పిజ్జా, బర్గర్, మటన్ వంటి ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఇవి కూడా నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. అందుకే వాటికి దూరంగా ఉండాలి.


**చక్కెర పదార్థాలు**
అదేవిధంగా కేకులు, స్వీట్లు తింటే రక్తంలో చక్కెర పెరిగి నిద్రకు భంగం కలుగుతుంది. కాబట్టి వాటిని కూడా రాత్రి పడుకునే ముందు అస్సలు తినకూడదు.

**ఎసిడిటీ ఫుడ్స్**
నిమ్మకాయ, నారింజ, టమోటా వంటి వాటిని రాత్రిపూట తింటే గుండెల్లో మంట కలుగుతుంది. ఎందుకంటే వాటిలో ఆమ్లాలు ఉంటాయి. అందుకే మంటగా అనిపిస్తుంది. అదేవిధంగా బ్రకోలీ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి తింటే కడుపులో గ్యాస్ ఏర్పడి నిద్రకు ఇబ్బంది కలుగుతుంది.

**ఆల్కహాల్**
మద్యం తాగితే మొదట నిద్ర వచ్చినట్టు అనిపించినా తర్వాత నిద్ర సరిగా ఉండదు. కాబట్టి రాత్రి పడుకునే ముందు మద్యానికి దూరంగా ఉండటం మంచిది.

# లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఓల్డ్ సిటీలో పర్యటించారు. బోనాల పండుగ సందర్భంగా వివిధ ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. నాంపల్లిలోని ఏడు గుళ్ల



పోచమ్మ అమ్మవారిని దర్శి ంచుకుని పూజలు చేశా రు. అలాగే చార్మినార్ అమ్మ వారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు.లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వాగతం పలికారు.

## బైండ్ల సమాజం అభివృద్ధికి

# బిఈఏటీ వేదికగా మారాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య




**హైదరాబాద్,**
బైండ్ల సమాజం విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు సాగాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన బిఈఏటీ (తెలంగాణ బైండ్ల ఉద్యోగుల సంఘం) విజన్ మీట్--2026 కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను పార్లమెంట్ వరకు చేరడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులే కారణమని అన్నారు. కులవృత్తి ద్వారా ఆదాయం వస్తోందనే కారణంతో పిల్లల చదువును మధ్యలోనే నిలిపివేయవద్దని ఉన్నత విద్య, వృత్తి విద్యను అభ్యసించాలని కోరారు. ప్రతి ఒక్కరూ 'పే బ్యాక్ టు సొసైటీ ని అలవర్చుకోవాలని అదే స్ఫూర్తితో సమాజానికి తిరిగి సేవ చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. బైండ్ల భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారిని తాను, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు కలిసి కోరినట్లు ఎంపీ తెలిపారు. తొలి విడతగా సుమారు రూ.2 కోట్ల వరకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని, త్వరలోనే దీనిపై ప్రభుత్వం నుంచి జీవో వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

బిఈఏటీ ను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బైండ్ల ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను సంఘంలో భాగస్వాములను చేయాలని డా. కడియం కావ్య కోరారు. సంఘంలో గ్రూపులు, విభేదాలకు తావులేకుండా అందరూ ఒక్కటిగా ముందుకు సాగాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా సంఘం కార్యకలాపాలను విస్తృతంగా ప్రచారం చేసి సభ్యత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఈఏటీ అధ్యక్షుడు చినపాక స్వామి, కోశాధికారి డా. జీలకర్ర స్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జీలకర్ర రామ్మూర్తి, ముఖ్య సలహాదారు కడెం ధనుంజయ, సలహా దారులు డా. జీలకర్ర సోమశేఖర్, చినపాక శ్రీనివాస ప్రసాద్, ఏ. ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు వేరైనా సమరం ఒకటే




- మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్.
- దుగ్గొండి మెపా మండల కమిటీ ఎన్నిక.

**వరంగల్ జిల్లా,**
మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ) దుగ్గొండి మండల కమిటీ ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దుగ్గొండి మండల తిమ్మంపేట లో నిర్వహించిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సమావేశంలో మండల కమిటీని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ముదిరాజులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ముదిరాజ్ యువత గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నప్పటికీ అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘాలు వేరైనా సమరం ఒకటే అదే బీసీ డి నుండి బిసి ఏ సాధనే కావాలని అన్నారు. అనంతరం మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ నర్సంపేట లో ముదిరాజ్ లు రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

ఈ సందర్భంగా దుగ్గొండి మెపా మండల కమిటీ ఎన్నుకుని నియామకం అయిన కమిటీ సభ్యులకు రాష్ట్ర బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షులు దండు రాజేందర్ ( తిమ్మంపేట), ప్రధాన కార్యదర్శి ఎద్దు కృష్ణంరాజు ( మహ్మదాపురం),ఉపాధ్యక్షులు(సంకెళ్ళ స్వామి), సహాయ కార్యదర్శి జవ్వాజి గురుదేవ్ (నాచినపల్లి) లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

# ఆదివాసీల హక్కులను

## కాలరాస్తున్న ప్రభుత్వాలు

- పి.డి.ఎస్.యు.ఆధ్వర్యం లో "అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం"




**కేయూ క్యాంపస్,**
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ ముందు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, ఆదివాసి వీరులైన బిర్సా ముండా,కొమరం భీమ్ ల చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించటం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదివాసీల రక్షణ కోసం కల్పించిన హక్కులను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ఆదివాసీల అభివృద్ధిని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రోడ్డు, బస్సు రవాణా సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబోలా అనిల్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారి వర్గాల ఆర్థిక ప్రయోజనాల కోసం ఆదివాసీలను అడవుల్లో నుండి వెళ్ళగొట్టే దుర్మార్గ పూరిత చర్యలకు ఒడిగడుతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. భారత రాజ్యాంగం లోని 5, 6 షెడ్యూల్, పెసా, 1/70, 2005 అటవీ హక్కుల చట్టాలను పగడ్బందీగా అమలు చేయడా నిర్వీర్యం చేసే కుట్రపూరిత విధానాలు ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని అన్నారు. జల్- జంగిల్- జమీన్ కొరకై ఆదివాసి సమాజం కొనసాగించే పోరాటాలకు విద్యార్థుల పక్షాన పి.డి.ఎస్.యు. సంపూర్ణ మద్దతునిస్తుందని తెలిపారు. ఆదివాసీలంతా తమ హక్కుల రక్షణ కోసం బిర్సా ముండా, కొమరం భీమ్, అల్లూరి, బాటన్న, లింగన్న లాంటి వీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, బి. నరేందర్,ఎస్.రాకేష్, దీక్షిత, రాష్ట్ర సహాయ కార్యదర్శులు డి. సురేష్,బుర్రా వీరభద్రం, బోయినపల్లి అజయ్, రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్, రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి.అనూష, రాష్ట్ర నాయకులు సీతారాం, సెంట్రల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ నాగరాజు,మారుతి, దండు వినయ్, వెంకటేష్, మహేష్, కిరణ్, శ్రావణ్, శశికిరణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు ఆరోగ్యకరమైన

## జీవనశైలికి ఎంతో మేలు

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు




**వనపర్తి జిల్లా,**
వనపర్తి పాలిటెక్నిక్ గ్రౌండ్ లో ఆరేపల్లి వెంకటేశ్వర్లు స్మారక 72వ స్టేట్ సీనియర్ మెన్ ,ఉమెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు హాజరై గెలుపొందిన ఉమెన్ టీం విన్నర్ రంగారెడ్డి జట్టు, రన్నర్ వరంగల్ జట్టు, మెన్ విన్నర్ వరంగల్ జట్టు, రన్నర్ నల్గొండ జట్టు విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ శారీరక దృఢత్వంతో పాటు మానసిక చురుకుదనాన్ని పెంచే క్రీడ అని అన్నారు.క్రీడలు మనలు క్రమశిక్షణ పట్టుదల సమయపాలన వంటి గొప్ప లక్షణాలను పెంపొందించేందుకు తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులు లక్ష్యాన్ని నిర్దేశించు కొని నిరంతరం సాధన చేస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఒలంపిక్స్ కు ఆడి మెడల్స్ సాధించి మన ప్రాంతానికి గుర్తింపు తేవాలని అన్నారు. క్రీడల్లో మహిళ భాగ్యస్వామ్యం పెరుగుతుండటం ఎంతో ఆనందకరమైన విషయమని, మహిళా క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ గౌడ్, రవీందర్ రెడ్డి, రామ్మోహన్ రావు గారికి, క్రీడాకారులకు ,కోచులకు, మరియు క్రీడాభిమానులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, ద్వార పోగు విజయ్ బాబు,క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి దానసరి అనసూయ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**భద్రాద్రి కొత్తగూడెం**
ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ అన్నారు. ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అనసూయ శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మహిళలు జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మంత్రి అన్నారు. ఇందిరాగాంధీ జీవితాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ధైర్యంగా నిలబడి దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎదిగిన ఇందిరాగాంధీని 'ఐరన్ లేడీ'గా దేశం గుర్తించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రతి మహిళ కూడా కష్టాలను అధిగమించి ఉక్కు మహిళగా ఎదగాలని ఆకాంక్షించారు.

కుటుంబ సమస్యలు ఆర్థిక ఇబ్బందులు ఇతర సవాళ్లు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని మంత్రి సూచించారు. కష్టాలు వచ్చినప్పుడు నిరాశ చెందకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని అన్నారు. మహిళలు ఐక్యంగా ఉండి పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మహిళలకు మౌలిక వసతులు ఆర్థిక సహాయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీలు అందించినట్లు తెలిపారు. మహిళల పేరుతో రుణాలు అందించి వారు స్వయం ఉపాధి చిన్నతరహా పరిశ్రమలు ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.రుణాలను వృథా చేయకుండా ఆదాయం వచ్చే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సూచించారు. ప్రారంభ దశలో కొంత కష్టంగా అనిపించినప్పటికీ క్రమశిక్షణతో ఐక్యంగా కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో మహిళలు వారి కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని అన్నారు.ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న స్థానిక వనరులను గుర్తించి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవాలని మంత్రి సూచించారు. కారం పొడి పసుపు మామిడి ఆధారిత ఉత్పత్తులు కోళ్ల పెంపకం పుట్టగొడుగుల పెంపకం చిన్నతరహా యంత్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను మహిళా సంఘాలు చేపట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో తయారు చేసే ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌తో పాటు హైదరాబాద్ ఇతర పట్టణాలు ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా తమ స్వశక్తితో సంపాదించి కుటుంబాలను నడిపించే స్థాయికి ఎదగాలని మంత్రి అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రుణాలు శిక్షణ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం లో అశ్వ రావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, డిఆర్డిఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని స్వర్ణలత లేని నా, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యల

## పరిష్కారానికి సహకరించండి



- వరంగల్ ఎంపీ కడియం కావ్యకు రిటైర్డ్ ఉద్యోగుల వినతి

**తొర్రూరు,**
తొర్రూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తొర్రూరు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధి బృందం ఆదివారం వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం తొర్రూరు మండల శాఖ అధ్యక్షుడు ఇట్టే సోమారెడ్డి నేతృత్వంలో అసోసియేట్ ప్రెసిడెంట్ మన్నూరు కోటయ్య, దీకొండ వీరభద్రం, ఆర్థిక కార్యదర్శి బోడ బాలాజీ, గట్టు సోమయ్య తదితరుల ప్రతినిధి బృందం వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్యను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకం కలిసి తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సౌకర్యం కోసం వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా సబ్ ట్రెజరీ ఆఫీస్, అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు ఈ వినతిపత్రంలో ఎంపీ ని కోరారు. అలాగే తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్మించిన తమ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం అభివృద్ధి పనుల కోసం కూడా సహకరించాలని వారు ఎంపీ కడియం కావ్యను అభ్యర్థించారు.

# కోకాబుర్రా బంతులు శ్రీలంక పిచ్‌లు

## పడిక్కల్ శతక రహస్యమిదే

'నయావాల్' ఛతేశ్వర్ పూజారా వీడ్కోలు అనంతరం మూడో స్థానంలో నిఖార్సైన ఆటగాడి కోసం ఎదురుచూస్తున్న భారత జట్టు నిరీక్షణకు తెరపడేలా ఉంది. సాయి సుదర్శన్ గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమవ్వగా.. అవకాశాన్ని అందిపుచ్చుకున్న దేవ్‌దత్ పడిక్కలశతకంతో చెలరేగాడు. ఓపెనర్లు విఫలమైనా గోడలా వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ.. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుతూ లంక బౌలర్ల భరతం పట్టిన పడిక్కల్ నేను సరైనోడిని అని నిరూపించుకున్నాడు. లంకపై అంతలా విజయవంతమవ్వడానికి పక్కా ప్లాన్‌తో సాధన చేశాడీ లెఫ్ట్ హ్యాండర్.



విదేశీ పర్యటనల్లో రాణించాలంటే అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రత్యర్థి బౌలర్ల బల హీనతలను పసిగట్టి.. జట్టును ఆదుకునే ఇన్నింగ్స్‌లు ఆడాలి. మూడో స్థానంపై కన్నేసిన సాయి సుదర్శన్ గాయం నుంచి కోలుకోలేదు. కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్‌లు సైతం స్క్వాడ్‌లో లేరు. ఈ పరిస్థితుల్లో భారీ సెంచరీ కొడితే.. జట్టును గట్టెక్కిస్తే చాలు మరిన్ని అవకాశాలు వస్తాయి. వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్ అదే పని చేశాడు.

లంక పర్యటనకు ఎంపికవ్వగానే అతడు తన బ్యాటింగ్ సన్నద్ధతను మార్చాడు. బెంగళూరులో తన చిన్నప్పటి కోచ్ మొహమ్మద్ నసీరుద్దిన్ తో కలిసి వర్కవుట్ చేశాడు. కోకాబుర్రా బంతులు, శ్రీలంక తరహా పిచ్‌లను తయారు చేయించుకొని బ్యాటింగ్ చేయడం ద్వారా అతడు వామప్ మ్యాచ్‌లో శతకం సాధించగలిగాడు.

# టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్

## నబీ సిరాజ్ చెలరేగేనా



వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(142 నాటౌట్) భారీ శతకంతో కోలుకున్న భారత జట్టు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండోరోజు ఓవర్ నైట్ స్కోర్ 357/6 వద్దే ఆటను ఆపేసిన టీమిండియా.. శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంకను పేసర్లు అకీబ్ నబీ, సిరాజ్‌లు వికెట్ల వేటతో దెబ్బకొడితే మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించడం ఖాయం. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ఆదిలో తడబడినా చివరకు నిలబడింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా(142 నాటౌట్) భారీ శతకంతో రెచ్చిపోయాడు. కేఎల్ రాహుల్(41), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్.. ఆఖరి ఓవర్ వరకూ క్రీజునంటుకుపోయాడు.


మానవ్ సుతార్(41) సైతం గొప్పగా ఆడడంతో టీమిండియాను ఆలౌట్ చేయాలనుకున్న లంక బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి. ఓవర్‌నైట్ స్కోర్ 357/6తో రెండో రోజు ఆటను ముగించిన భారత్.. మూడో రోజు తొలి బంతికి ముందే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంక 3 ఓవర్లకు ఏడు పరుగులు చేసింది. ప్రస్తుతానికి లంక 13 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# హై జంప్‌లో భారత్‌కు తొలి రజతం

## చరిత్ర సృష్టించిన బసంత్

అమెరికాలోని ఒరెగా వేదికగా జరుగుతున్న అండర్ 20 ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జావెలిన్ త్రోలో పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ అశిష్ యాదవ్‌రజతం కొల్లగొట్టగా.. హై జంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. పురుషుల ఫైనల్లో సత్తా చాటిన బసంత్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో వెండి వెలుగులు విరజిమ్మాడు.

అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత కుర్రాళ్లు రికార్డులు పట్టేస్తున్నారు. జావెలిన్ త్రోలో భావి తారగా ఎదుగుతున్న అశీష్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించిన మరునాడే.. హై జంపర్ బసంత్ కుమార్ మేఘ్వాల్ సైతం వెండి పతకం గెలుపొందాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత అథ్లెట్ రెండో ప్రయత్నంలో ఏకంగా 2.21 మీటర్ల ఎత్తు దూకాడు. తద్వారా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు హై జంప్‌లో తొలి పతకం సాధించిన బసంత్ చరిత్రకెక్కాడు. లాంగ్ జంప్‌లో షహన్వాజ్ ఖాన్ కాంస్యంతో మెరిశాడు. శనివారం పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో అశీష్ యాదవ్ 74.09 మీటర్ల దూరం ఈటెను విసిరి రెండో స్థానంతో రజతం పట్టేసిన విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం నీరజ్ పసిడి గెలిచిన ఈ టోర్నీలో అశీష్ అంచనాలు అందుకుంటూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు.





# శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్

## టీమిండియా ఘన విజయం




శ్రీలంక ఎలెవన్‌తో కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల వార్మప్ టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో రోజు 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్(61బి) హాఫ్ సెంచరీ చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం బారిన పడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్(44) నేడు బ్యాట్ పట్టాడు. స్టార్ బౌలర్ సిరాజ్(32బి) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆఖరిలో హ్యాట్రిక్ సిక్సర్లు బాది ఆశ్చర్యపరిచాడు. శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో కేషారా 2 విశ్వా ఫెర్నాండో, రమేశ్ మెండీస్ తలొక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి రోజు వికెట్లు తీయడానికి ఇబ్బంది పడిన భారత బౌలర్లు.. రెండో రోజు రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 357/6 వద్ద డిక్లేర్ ఇచ్చింది. దేవదత్ పడిక్కల్(142బి) సూపర్ సెంచరీ చేశాడు. రవీంద్ర జడేజా(63బి) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 200/6 వద్ద డిక్లేర్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. అద్భుతంగా ఛేదించింది.

# షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌లో అభిషేక్ శర్మ గిల్

## ఏ జట్ల తరఫున ఆడనున్నారంటే

పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) ఆధ్వర్యంలో తొలిసారిగా జరగనున్న షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌కు స్టార్ క్రికెటర్లు సిద్ధమయ్యారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యువ సంచలనం అభిషేక్ శర్మలను అధికారులు మార్కీ ప్లేయర్లుగా ప్రకటించారు. దీంతో తొలి సీజన్‌లోనే ఈ లీగ్‌కు భారీ క్రేజ్ లభించింది. గిల్ ఫజిల్కా ఫాల్కన్స్ తరఫున బరిలోకి దిగనుండగా.. అభిషేక్ శర్మ అమృత్‌సర్ సూర్మాస్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. వీరితో పాటు స్టార్ ప్లేయర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్‌లు కూడా మార్కీ ప్లేయర్లుగా వివిధ జట్లకు ఎంపికయ్యారు. ఆరు జట్లతో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 27 మ్యాచ్‌లు ఉంటాయి. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. న్యూ చండీగఢ్‌లోని పీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో లీగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. పంజాబ్ నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యమని పీసీఏ పేర్కొంది. తన స్వస్థలం ఫజిల్కాకు చెందిన గిల్ కూడా ఈ టోర్నీపై ఆశాభావం వ్యక్తం చేశాడు. 'పంజాబ్ ఎప్పటినుంచో గొప్ప క్రికెటర్లను భారత జట్టుకు అందిస్తోంది. ఈ లీగ్ ద్వారా మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని నమ్ముతున్నా' అని గిల్ తెలిపాడు.





**అదే లక్ష్యం..**

షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌లో రౌండ్ రాబిన్ విధానంలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో ఫ్రాంచైజీకి ఒక మార్కీ ప్లేయర్‌తో పాటు కనీసం ఇద్దరు ఐకాన్ ప్లేయర్లను తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి జట్టుకు రూ.45 లక్షల బడ్జెట్ కేటాయించగా.. గరిష్ఠంగా 20 మంది ఆటగాళ్లతో స్క్వాడ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.

యువ క్రికెటర్లకు స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం కల్పించి.. వారిని ఉన్నత స్థాయి క్రికెట్‌కు సిద్ధం చేయడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని పీసీఏ భావిస్తోంది.

పంజాబ్ క్రికెట్‌కు మరింత మంది ప్రతిభావంతులను అందించే వేదికగా షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తోంది.

# బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా

## కేంద్రం అనుమతి కోరనున్న బీసీసీఐ

భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు సొంతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, త్వరలోనే కేంద్రాన్ని సంప్రదించనున్నట్లు బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే తమ దేశానికి రావాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఇప్పటికే బీసీసీఐకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని బీసీసీఐ అధికారి తెలిపారు. త్వరలోనే పర్యటనపై మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 15 వరకు భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు బంగ్లాదేశ్ షెడ్యూల్ విండోను కేటాయించింది. ఇందులో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉన్నాయి. సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో వన్డేలు.. సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో టీ20లు జరగాల్సి ఉంది. ఆగస్టు 28న భారత జట్టు బంగ్లాదేశ్‌కు చేరుకోవాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ అనుమతిపైనే పర్యటన ఆధారపడి ఉన్నట్లు సమాచారం.




**ముస్తాఫిజుర్ వివాదంతోనే..**

భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాల్లో గత కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. 2026 ఐపీఎల్ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ తర్వాత బీసీసీఐ ఆదేశాలతో అతడిని జట్టు నుంచి విడుదల చేయాల్సి వచ్చింది. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ తీవ్రంగా స్పందించింది. అనంతరం భద్రతా కారణాలను చూపుతూ 2026 టీ20 ప్రపంచకప్ కోసం భారత పర్యటనకు తమ జట్టు రాదని బీసీబీ ప్రకటించింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి ఇతర వేదికలకు మార్చాలని ఐసీసీని కోరింది. ఈ వివాదం అంతర్జాతీయ క్రికెట్‌కే పరిమితం కాలేదు. ముస్తాఫిజుర్ వ్యవహారం నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారం, ప్రచారాన్ని ఆ దేశ ప్రభుత్వం నిరవధికంగా నిలిపివేసింది.

**గతంలోనూ వాయిదా..**

భారత జట్టు 2025 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే అంతర్జాతీయ క్రికెట్ కట్టుబాట్లు, షెడ్యూల్ సౌలభ్యం కారణంగా ఆ పర్యటనను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ సిరీస్ ఇరు దేశాల క్రికెట్ సంబంధాలకు కీలకంగా మారింది. బంగ్లా-భారత్ మధ్య మ్యాచ్ నిర్వహించాలని బీసీబీ పట్టుదలగా ఉంది. ఇరు బోర్డుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చే నిర్ణయంపైనే సిరీస్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఈ పర్యటన జరిగితే గత కొంతకాలంగా దెబ్బతిన్న భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని బీసీబీ ఆశిస్తోంది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లో కీలక మార్పులు కోచింగ్

## బృందంలో గంగూలీ యువరాజ్ సింగ్

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భారత క్రికెట్ దిగ్గజాలు సౌరభ్ గంగూలీ, యువరాజ్ సింగ్ బెంగళూరులోని జస్ట్ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కనిపించడంతో ఈ చర్చ మొదలైంది. డీసీ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా గంగూలీ మళ్లీ బాధ్యతలు నిర్వర్తించనున్నాడంటూ గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా యువీ, గంగూలీ ఢిల్లీ శిక్షణ శిబిరంలో కనిపించడంతో సహాయక బృందంలో భారీ మార్పులు ఉండొచ్చన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ శిక్షణ శిబిరంలో యువరాజ్ నెట్స్ వద్దే ఉండి యువ బ్యాటర్లకు సాంకేతిక సూచనలు చేశాడు. ముఖ్యంగా పవర్ హిట్టింగ్ మెరుగుపరుచుకోవడంపై ప్లేయర్లకు సలహాలు ఇస్తూ కనిపించాడు. మరోవైపు గంగూలీ జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించినట్లు సమాచారం. భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా శిబిరంలో పాల్గొని స్థానిక బౌలర్ల ప్రతిభను పరిశీలించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ మాత్రం ఈ విషయం గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా గంగూలీ మరోసారి జట్టులో కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా వ్యూహాత్మక వ్యవహారాలను పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇక యువరాజ్ సింగ్ ఐపీఎల్‌లో తొలిసారి బ్యాటింగ్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.




ఇటీవల కాలంలో యువరాజ్ సింగ్ పలువురు యువ బ్యాటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు అతడి సూచనలను ప్రశంసించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ విభాగానికి యువరాజ్ మార్గదర్శకత్వం కలిసొస్తుందని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం. వచ్చే సీజన్ నుంచి జేఎస్‌డబ్ల్యూ సంస్థ పూర్తిస్థాయి నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో సపోర్ట్ స్టాఫ్‌తో పాటు ఆటగాళ్ల ఎంపికలోనూ భారీ మార్పులు ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఐపీఎల్ టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఢిల్లీ అభిమానులకు మరో గుడ్ న్యూస్ కూడా ఉంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నుంచి స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్‌ను తిరిగి జట్టులోకి తీసుకొచ్చే ప్రక్రియను ఫ్రాంచైజీ పూర్తి చేసింది. గంగూలీ వ్యూహాలు.. యువరాజ్ బ్యాటింగ్ మంత్రాలు.. పంత్ నాయకత్వం కలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ రూపురేఖలు పూర్తిగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

## విజయ్ సేతుపతి స్లమ్ డాగ్ నుంచి అదిరిపోయే
## అప్డేట్ ఇంటెన్స్ లుక్‌లో టబు

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది.ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది.




## ఓటీటీలోకి స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే రూ.12 వేల
## కోట్ల వసూళ్లతో దూసుకెళ్తున్న మూవీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సోనీ పిక్చర్స్ కాంబినేషన్‌లో టామ్ హాలండ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా భారతదేశంలోనూ స్పైడర్ మ్యాన్‌కు ఉన్న క్రేజ్ మరోసారి స్పష్టమైంది. భారత్‌లో ఐమాక్స్ స్క్రీన్లు అందుబాటులో లేకపోయినప్పటికీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తొలి మూడు రోజుల్లోనే సుమారు రూ.309 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కొత్త రికార్డులు నమోదు చేస్తోంది.ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోనూ స్పైడీ దూకుడు కొనసాగుతోంది. విడుదలైన వారం రోజులు పూర్తికాకముందే ఈ చిత్రం 1 బిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు తెలుస్తోంది. 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' తర్వాత ఇంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న చిత్రాల్లో ఇదొకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.12 వేల కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే 2 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి కూడా అడుగుపెట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకెళ్తున్న 'బ్రాండ్ న్యూ డే' ఓటీటీ రిలీజ్‌పై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ 2026లో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.అయితే, థియేట్రికల్ రన్ ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై ఓటీటీ విడుదల తేదీ ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సినిమా భారీ వసూళ్లు సాధిస్తున్న నేపథ్యంలో డిజిటల్ రిలీజ్‌ను కొంత ఆలస్యం చేసే అవకాశం కూడా ఉందనే ప్రచారం జరుగుతోంది. సోనీ పిక్చర్స్‌కు సంబంధించిన గ్లోబల్ డిజిటల్ డీల్ ప్రకారం ఈ సినిమా థియేట్రికల్ రన్ పూర్తైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే భారతదేశానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ విషయంలో మాత్రం పరిస్థితి కొంత భిన్నంగా ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇండియాలో మార్వెల్‌కు సంబంధించిన పలు సినిమాలు, ముఖ్యంగా వీజఖ కంటెంట్ జియోహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది. 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' కూడా అక్కడే స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో 'బ్రాండ్ న్యూ డే' కూడా భారతీయ ప్రేక్షకుల కోసం జియోహాట్‌స్టార్‌లోకి వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్‌లో ఏ ప్లాట్‌ఫామ్ ఈ సినిమా డిజి టల్ హక్కులను దక్కించుకుంటుందనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## మహేశ్‌బాబు పుట్టినరోజు వేళ శుభాకాంక్షల వెల్లువ
## చిరంజీవి పవన్ వెంకటేష్ ప్రత్యేక విషెస్

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో హోరెత్తుతోంది. ఆగస్టు 9న మహేశ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ప్రత్యేకంగా విషెస్ చెబుతున్నారు. మహేశ్ సినీ ప్రయాణం, సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ పలువురు స్టార్ హీరోలు ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మహేశ్‌బాబుకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఎదుగుదలను ఎన్నో ఏళ్లుగా చూస్తూ రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని చిరంజీవి పేర్కొన్నారు.భారతీయ సినిమాలో అత్యంత ప్రేమాభిమానాలు పొందుతున్న ప్రముఖ నటుల్లో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని అన్నారు. భగవంతుడు ఎల్లప్పుడూ మహేశ్‌ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు చిరంజీవి తెలిపారు. మరోవైపు మహేశ్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతూ పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కూడా ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, మరెన్నో విజయాలు దక్కాలని ఆకాంక్షించింది. ముఖ్యంగా మహేశ్‌బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రశంసించారు. చిన్నారులకు సహాయం చేయడంలో ఆయన చూపిస్తున్న నిబద్ధత, మానవతా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారువిక్టరీ వెంకటేష్ కూడా తనదైన శైలిలో మహేశ్‌బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'నా చిన్నోడు మహేష్' అంటూ ఆప్యాయంగా సంబోధించిన వెంకటేష్.. మహేశ్ జీవితంలో ఎల్లప్పుడూ ప్రేమ, నవ్వులు నిండాలని ఆకాంక్షించారు. అంతేకాదు, మహేశ్ నటిస్తున్న 'వారణాసి'పై కూడా వెంకటేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో రుద్ర పాత్రలో మహేశ్ రగ్గడ్‌గా, హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడని ప్రశంసించారు. వచ్చే ఏడాది 'వారణాసి'తో మహేశ్ ప్రపంచాన్ని ఏలబోతున్నాడని పేర్కొంటూ.. ఆ సినిమాను చూసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. మహేశ్‌బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మహేశ్ లుక్స్ ఇప్పటికే అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. రుద్ర పాత్రలో మహేశ్ కనిపించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కూడా భారీ ఎత్తున సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నారు. థియేటర్లలో ఆయన పాత సినిమాల రీ–రిలీజ్‌లు, ప్రత్యేక కార్యక్రమాలు, సోషల్ మీడియాలో ట్రెండ్స్‌తో సూపర్‌స్టార్ బర్త్‌డేను ఘనంగా జరుపుకుంటున్నారు.



## వైజాగ్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్
### విశాఖలో ఏఏఏ సినిమాస్'ని ఘనంగా ప్రారంభించిన అల్లు అర్జున్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన థియేటర్ల వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ నగరమైన విశాఖపట్నంలో అత్యాధునిక హంగులతో కూడిన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు.వైజాగ్‌లోని ఇనార్బిట్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక థియేటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఏషియన్ సినిమాస్ తో కలిసి అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ మల్టీప్లెక్స్ విశాఖ సినీ ప్రియులకు ఒక సరికొత్త మరియు ప్రపంచస్థాయి సినిమా అనుభూతిని అందించనుంది.

ఇది ఆంధ్రప్రదేశ్లోనే అతిపెద్ద ఎల్ఈడీ సినిమా స్క్రీన్ అని తెలుస్తుంది. భారత దేశంలోనే మొట్టమొదటి ఎల్ఈడీ ప్రొజెక్షన్ క్యూ–లక్సన్ స్క్రీన్‌ను ఇందులో అమర్చారు. మొత్తం 8 స్క్రీన్లతో, 1,556 సీటింగ్ సామర్థ్యంతో పాటు వీఐపీ అతిథుల కోసం ప్రత్యేకంగా 'ఐకాన్ స్టార్ లాంజ్' మరియు '82 లాంజ్'లను ఏర్పాటు చేశారు.

## అల్లరి నరేష్ కొత్త సినిమా రంభ
## ఊర్వశి మేనక టీజర్ డేట్ ఫిక్స్

టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ తన సిగ్నేచర్ కామెడీ జోనర్‌తో మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఆగష్టు 11న టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్ డేట్‌లో మాత్రమే చిన్న సర్దుబాటు... ఎంటర్‌టైన్‌మెంట్‌లో మాత్రం ఎలాంటి సర్దుబాట్లు ఉండవు" అంటూ చిత్ర యూనిట్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ టీజర్ ఆగష్టు 11న గ్రాండ్‌గా లాంచ్ కానుంది. అల్లరి నరేష్ పాత కామెడీ టైమింగ్‌ను గుర్తుచేసేలా ఈ సినిమా ఉండబోతుందని పోస్టర్లు చూస్తేనే అర్థమవుతోంది. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన సురభి హీరోయిన్‌గా నటిస్తుండగా, చంద్రమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా, లెమన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లరి నరేష్ మార్క్ ఫుల్–ఆన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4, 2026న ఘనంగా విడుదల కానుంది. థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించేందుకు రెడీ అవుతున్న ఈ సినిమా టీజర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## వీసా కారణంగా సిడ్నీ స్టేజ్ షో రద్దు అభిమానులకు
## క్షమాపణలు చెప్పిన మోహన్ లాల్

ఆస్ట్రేలియాలోని సిడ్నీ వేదికగా జరగాల్సిన తన లైవ్ స్టేజ్ షో వీసా సమస్య కారణంగా వాయిదా పడటంతో మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఊహించని పరిణామం పట్ల ఆయన అభిమానులకు, నిర్వాహకులకు క్షమాపణలు చెబుతూ సింగపూర్ నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన 50 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు.సింగపూర్ లో ఉన్న తనకు ఆస్ట్రేలియా వీసా సమయానికి రాకపోవడం వల్లనే తాను సిడ్నీ వెళ్లలేకపోయానని, అయితే సింగర్ కేఎస్ చిత్రతో సహా మిగతా బృందమంతా ఇప్పటికే సిడ్నీ చేరుకున్నారని ఆయన తెలిపారు. ఇది టెక్నికల్ లేదా క్లెరికల్ పొరపాటు కావచ్చని, దీనికి ఎవరిని తాను బ్లేమ్ చేయదలచుకోలేదని, ఈ తప్పు పూర్తిగా తనదేనంటూ మొత్తం బాధ్యతను తానే మోస్తున్నట్లు మోహన్ లాల్ స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన కోసం చాలా దూరం నుండి డ్రైవ్ చేసుకుని వచ్చిన ప్రేక్షకులకు హృదయపూర్వక క్షమాపణలు తెలుపుతున్నానని, తాను పూర్తిగా అసహాయ స్థితిలో ఉన్నానని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. త్వరలోనే అదే టీమ్‌తో మళ్లీ సిడ్నీకి వచ్చి అద్భుతమైన షోను నిర్వహిస్తామని ఆయన అభిమానులకు గట్టి హామీ ఇచ్చారు.



## వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్ ట్రైలర్ వచ్చేది ఆరోజే

భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారుకాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకనిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్–ప్యాక్డ్ యాక్షన్‌తోకానుంది.

## కొరియన్ కనకరాజు దూకుడు కొడుకు
## సినిమా హిట్‌పై నాగబాబు ఎమోషనల్ ట్వీట్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద జోరు చూపిస్తోంది. రాయలసీమ నేటివిటీకి కొరియన్ కల్చర్‌ను జోడించి తెరకెక్కించిన ఈ విభిన్నమైన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆగస్టు 7న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు తొలి షో నుంచే మంచి స్పందన రావడంతో కలెక్షన్ల పరంగా కూడా దూసుకెళ్తోంది.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా.. సత్య తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. అనంతపురం జిల్లా పెనుగొండ నేపథ్యంలో సాగే ఈ కథలో కనకరాజు అనే పల్లెటూరి యువకుడిని ఓ కొరియన్ ఆత్మ ఆవహిస్తుంది. ఆ తర్వాత అతడి జీవితంలో చోటుచేసుకునే విచిత్రమైన పరిణామాలు, కామెడీ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.'కొరియన్ కనకరాజు' విడుదలైన తొలి రోజే దాదాపు రూ.10.2 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.మంచి ఆక్యుపెన్సీతో కొనసాగింది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com